


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




వరంగల్ | 23-05-2026 శనివారం | సంపుటి : 11 | సంచిక : 336 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on

# తరతరాల కోటా సరికాదు

## సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

**ఐఏఎస్, ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న పిల్లలకూ రిజర్వేషన్లు అవసరమా?**

**తరతరాలుగా అదే కోటాను కోరుకోవడం సరికాదు**

**ఇలాగైతే రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేము**

**క్రీమీలేయర్ మినహాయింపు పిటీషన్లపై సుప్రీంకోర్టులో విచారణ**





విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుంది. రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరి కాదు, ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుం చి ఎప్పటికీ బయటప డలేము. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది.

జస్టిస్ బి.వి. నాగరత్న

**న్యూఢిల్లీ, మే 22 (వుదయం బ్యూరో) :** దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తల్లి దండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని ప్రశ్నించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నా తర్వాత కూడా మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదని తేల్చి చెప్పారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేమని అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని జస్టిస్ చెప్పారు. కానీ రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని వెల్లడించారు. ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని స్పష్టం చేశారు. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను,

మిగతా 2లో

# అవినీతి కోటీశ్వరుడు

- రూ. కోట్లకు పడగలెత్తిన డిప్యూటీ కలెక్టర్
- ప్రభుత్వ భూములు పెద్దఎత్తున కబ్జా
- అతనికి సంబంధించిన ఎనిమిది ఇళ్లపై ఏసిబి అధికారులు ఏకకాలంలో దాడులు
- రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు నిర్ధారణ

**రంగారెడ్డి, మే 22 (వుదయం ప్రతినిధి) :** గతంలో మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకు సంబంధించిన ఎనిమిది ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో వంశీ మోహన్‌కు సంబంధించి.. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అధికారులు నమోదు చేశారు. వంశీ మోహన్ పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులు కాజేసినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్ ఆర్డీవోగా పనిచేశారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో ఎనిమిది ఎకరాల భూమిని ఆయన కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి.. దానిని రియల్టర్‌కు కట్టెబట్టినట్లు విమర్శలు వచ్చాయి. ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్‌ను వంశీ మోహన్ తీసుకున్నట్లు ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించారు. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో వంశీ మోహన్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

## వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు

- తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం
- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి




**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.

మిగతా 2లో

### డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో

# తెలంగాణ రోల్ మోడల్

**డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్**

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

**ప్రజల ముంగిటకే ప్రభుత్వ పౌర సేవలు**



**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణ ను ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026లో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతున్నదని.. సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ–డిఫైన్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు అనుగుణంగా మార్పులను అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు.. సాధిస్తున్న

మిగతా 2లో

### కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్ లో

# నిమ్స్ రికార్డు

**2వేల కిడ్నీ మార్పిడిలతో దక్షిణ భారత దేశంలో నెంబర్ వన్‌గా నిమ్స్**

**వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు**




**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్ లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్‌లో దేశంలోనే అరుదైన రికార్డు నమో దు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2వేల కిడ్నీ మార్పిడులు పూర్తి చేసింది. కిడ్నీ మార్పిడిల్లో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నెంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్‌లో గుజరాత్ లోని ఐకెడీఆర్‌సీ నెంబర్ వన్ స్థానంలో ఉంది. సెకండ్ ప్లేస్‌లో లూధియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా..

మిగతా 2లో

# వందలో 97 భారత్‌లోనే

## ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల్లో 97 నగరాలు ఇండియాలోనే

- తీవ్రమైన వడగాలుల కారణంగా 45డిగ్రీల సెల్సియస్ దాటిన ఉష్ణోగ్రతలు
- 300 వడదెబ్బ అనుమానిత అనారోగ్య కేసులు
- ఆసుపత్రుల వద్ద, అతిసారం, నిర్జలీకరణ సమస్యలతో క్యూలు కడుతున్న రోగులు



**వుదయం డెస్క్, మే 22 :** శుక్రవారం మధ్యాహ్నం నాటికి, ప్రపంచంలోని అత్యంత వేడిగా ఉన్న 100 నగరాల్లో 97 నగరాలు భారతదేశంలోనే ఉన్నాయి. దేశంలోని ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాలను చుట్టుముట్టిన తీవ్రమైన వడగాలుల ప్రభావంతో, మధ్యాహ్నానికే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను మించిపోయాయి. ఎక్యుఐ. ఇన్ ప్రకారం, మధ్యాహ్నం 2:50 గంటల సమయానికి ప్రపంచంలోని అత్యంత వేడిగా ఉన్న అగ్ర–100 నగరాల జాబితాలో భారతీయ నగరాలే ఆధిపత్యం వహించాయి. ఇందులో ఒడిశాలోని బలాంగీర్ 48 డిగ్రీల ఉష్ణోగ్రతతో అత్యంత వేడిగా ఉన్న ప్రాంతంగా నిలిచింది. ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాలలో 97వ భారతదేశంలో దాని తర్వాత స్థానాలలో బీహార్‌లోని ససారం 48 డిగ్రీల సెల్సియస్‌తో, ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి 47డిగ్రీల సెల్సియస్‌తో నిలిచాయి. అనేక నగరాల్లో గాలిలో తేమ 6 నుండి 8 శాతం మధ్య ఉండటంతో, అక్కడి పరిస్థితులు అత్యంత వేడి వర్గంలోకి వచ్చాయి. ఈ అగ్ర–100 జాబితాలో నేపాల్‌లోని మూడు నగరాలు మాత్రమే మినహాయింపుగా ఉన్నాయి.

మిగతా 2లో



# పల్లె ఆర్థిక ప్రగతిలో బ్యాంకుల పాత్ర కీలకం

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలి**

**ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాలి**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** పల్లె ఆర్థిక ప్రగతిలో బ్యాంకుల పాత్ర కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు భాగస్వాములు కావాలని ఆయన బ్యాంకర్లకు పిలుపు నిచ్చారు.

మిగతా 2లో

### దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి

# ఎన్నికలకు వెళ్లాలి

## సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

- **ఫిరాయింపు ఎమ్మెల్యేలతోనైనా రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరాలి**
- **2034 వరకు సీఎంగా ఉంటాననే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదు**
- **ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం**
- **రైతుల ఇబ్బందులపై రేవంత్ కు అవగాహన లేదు**
- **పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచిన ఘనత కాంగ్రెస్‌ది**



**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** నిజంగానే 2034 వరకు సీఎంగా ఉంటాననే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉంటే వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. ఆ దమ్ము లేకపోతే.. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి లాక్కున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. తాను బండి సంజయ్‌లా తన కొడుకు కేసుల్లో పేరు వాడొద్దంటూ కోర్టుల నుండి 'జీపీజీ ఆర్డర్లు' తెచ్చుకునే రకం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు.తన బావమరిది ఫామ్‌హౌస్ కేసు గురించి మాట్లాడుతున్న రేవంత్‌కు.. అక్కడ ఏమీ దొరకలేదని స్వయంగా ప్రభుత్వ అధికారులే తేల్చిచెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనే నాథుడు లేక రైతులు రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే, ఆ నిరసనల్లో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కనీసం 35 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. కానీ రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు మాత్రం 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయంటూ


మిగతా 2లో

# ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

**మేం అధికారంలో రాగానే చేసే మొదటి పని ఇదే**

**ఫార్మా సిటీని రెస్టోర్ చేస్తాం : మాజీ మంత్రి హరీశ్ రావు**

**ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం**



**హైదరాబాద్, మే 22 (ఎఎంఎస్) :** బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీని రెస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అక్కడి నుంచి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కేంద్ర పర్యావరణశాఖ కేవలం ఫార్మా సిటీకి మాత్రమే అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని తాము ఫార్మా సిటీని ప్రారంభించామని చెప్పారు. తెలంగాణ నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయిందన్న హరీశ్ రావు.. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదని ఆరోపించారు.




2

### శంషాబాద్ విమానాశ్రయంలో

# 10 కేజీల గాంజా స్వాధీనం

**బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో గుర్తించిన కస్టమ్స్ అధికారులు**

### అల్లర్ల కేసులో ఉమర్ ఖాలిద్‌కు

# మూడు రోజుల మధ్యంతర బెయిలు

**తల్లి శస్త్రచికిత్సకు హాజరయ్యేందుకు బెయిలు మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు**

**దిగువ కోర్టు మధ్యంతర బెయిల్ నిరాకరణతో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఖాలిద్**

5




# రైతు వ్యతిరేకి ప్రభుత్వం

**రైతుల సమస్యలపై సీఎం ఉదాసీనత : టీఆర్ఎస్ చీఫ్ కవిత**

**రెండున్నరేళ్లుగా వ్యవసాయశాఖ పై కనీసం రివ్యూ చేయలేదు**

**ధాన్యం కొనకుండా, తరుగు పేరుతో రైతులకు అన్యాయం**

**సచివాలయం వద్ద ధర్నా, అరెస్ట్ చేసిన పోలీసులు**



2

# వందలో 97 భారత్‌లోనే

మొదటి పేజీ తరువాయి

23వ స్థానంలో ధాంగడి, 34వ స్థానంలో నేపాల్‌గంజ్, 76వ స్థానంలో లుంబినీ సంస్కృతిక్. ఇక్కడ ఉష్ణోగ్రతలు 45డిగ్రీల సెల్సియస్ నుండి 46డిగ్రీల సెల్సియస్‌మధ్య ఉన్నాయి. ఈ మూడు నేపాల్ నగరాలు మినహా, జాబితాలోని మిగతా అన్ని ప్రదేశాలు భారతదేశంలోనే ఉన్నాయి. అత్యంత వేడిగా ఉన్న నగరాల జాబితాలోని తొలి 100 స్థానాల్లో, ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో 26వ స్థానంలో, అయోధ్య 46 డిగ్రీల సెల్సియస్‌తో 32వ స్థానంలో, పంజాబ్‌లోని పాటియాలా 46డిగ్రీల సెల్సియస్‌తో 42వ స్థానంలో, తెలంగాణలోని వరంగల్ 46డిగ్రీల సెల్సియస్‌తో 55వ స్థానంలో, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ 46డిగ్రీల సెల్సియస్‌తో 56వ స్థానంలో నిలిచాయి. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ 45డిగ్రీల సెల్సియస్‌తో 62వ స్థానంలో, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ 45డిగ్రీల సెల్సియస్‌తో 64వ స్థానంలో, జార్ఖండ్‌లోని ధన్‌బాద్ 45డిగ్రీల సెల్సియస్‌తో 71వ స్థానంలో, చండీగఢ్ 45డిగ్రీల సెల్సియస్‌తో 77వ స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా 44 డిగ్రీల సెల్సియస్‌తో 90వ స్థానంలో, రాజస్థాన్‌లోని భరత్‌పూర్ 44డిగ్రీల సెల్సియస్‌తో 97వ స్థానంలో, మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి 44 డిగ్రీల సెల్సియస్‌తో 100వ స్థానంలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, మార్చి ప్రారంభం నుండి మే మధ్య కాలం వరకు ఆంధ్రప్రదేశ్‌లో 300కి పైగా అనుమానిత వడదెబ్బ సంబంధిత అనారోగ్య కేసులు నమోదైనట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపినట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది. మార్చి 1 నుండి మే 19 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 325 అనుమానిత వడదెబ్బ (హీట్ స్ట్రోక్) కేసులు నమోదయ్యాయి. వీటిలో దాదాపు మూడో వంతు కేసులు మే నెల ప్రారంభం నుండి నమోదవడం గమనార్హం. శరీరం అధికంగా వేడెక్కడం వల్ల కలిగే వైద్య అత్యవసర పరిస్థితి అయిన వడదెబ్బకు, సకాలంలో చికిత్స అందించకపోతే గందరగోళం, తల తిరగడం, వికారం, మూర్ఛలు, స్పృహ కోల్పోవడం, అవయవ వైఫల్యం వంటివి సంభవించవచ్చని ఆ నివేదిక పేర్కొంది.

ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావడం మానుకోవాలని రాష్ట్ర అధికారులు ప్రజలకు సూచించారు. ఆ సమయంలో వేడి గాలులు, తీవ్రమైన ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో ఉంటాయి అని హెచ్చరించారు. మే 22 నుండి మే 27 మధ్య, ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వడగాలుల నుండి తీవ్ర వడగాలుల పరిస్థితులు నెలకొంటాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ తీవ్రమైన ఎండల కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లోని ఆసుపత్రుల వద్ద, అతిసారం, నిర్జలీకరణ సమస్యలతో బాధపడుతున్న రోగుల క్యూలు భారీగా పెరిగాయి. అదే సమయంలో పశ్చిమ రాష్ట్రమైన గుజరాత్‌లో నీటి కొరత ఏర్పడినట్లు వార్తా సంస్థ ఎఎన్ఐ విడుదల చేసిన ఫోటోలు వెల్లడిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) ప్రకారం, మైదాన ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత కనీసం 40 డిగ్రీల సెల్సియస్‌కు, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరి, సాధారణం కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉన్నప్పుడు, లేదా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను తాకినప్పుడు వడగాలులను ప్రకటిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత 48 డిగ్రీల సెల్సియస్ అని, ఉత్తర ప్రదేశ్‌లోని బందాలో ఈ వారారంభంలో ఇది నమోదైందని స్థానిక మీడియా వెల్లడించింది.

### పల్లె ఆర్థిక ప్రగతిలో
# బ్యాంకుల పాత్ర కీలకం

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణలో క్రెడిట్–డిపాజిట్ (సి.డి) నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయని చెప్పారు. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందన్న మంత్రి... నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం అన్నారు. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని వివరించారు. వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడిందని వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయాలతో బ్యాంకుల్లో వ్యవసాయ నిరర్ధక ఆస్తులు (మొండి బకాయిలు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయన్నారు. తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్న మంత్రి... ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలని చెప్పారు. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని మంత్రి వివరించారు. వ్యవసాయాన్ని ఆధునీకీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.147.91 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని తెలిపారు. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలని మంత్రి తెలిపారు.

### డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో
## తెలంగాణ రోల్ మోడల్

మొదటి పేజీ తరువాయి

పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నదన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్ లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకో సిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. మారుతున్న ట్రెండ్స్‌కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్‌ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్–ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజారాణి జంపాల, ఎన్ఎస్ఈ సీఐఎస్‌వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాడ్సే పాల్గొన్నారు.

## తరతరాల కోటా సరికాదు

మొదటి పేజీ తరువాయి

మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది.

**ఇంద్ర సాహ్నీ తీర్పు.. ప్రస్తుత నిబంధనలు**

1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీ లేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. రాబోయే రోజుల్లో క్రీమీ లేయర్ నిబంధనలపై కోర్టు ఇచ్చే తీర్పు రిజర్వేషన్ల చట్టాల్లో మరిన్ని సంస్కరణలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి




శుక్రవారం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్–డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయని ఆయన చెప్పారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయంగా చెప్పారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు మరియు అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయం అని చెప్పారు. పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ.. ఒకటని డిప్యూటీ సీఎం చెప్పారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం–అభివృద్ధి రెండింటిని జోడెద్దులుగా పరుగులు తీయగలవని ప్రజాప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ఆయన పునరుద్ఘాటించారు.

**సౌరశక్తిలో స్థిరమైన ప్రగతి..** నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందని భట్టి అన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి (జిఎస్డీపీ), ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రజాప్రభుత్వం 2047 ఆర్థిక సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పెద్ద కల. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2శాతం గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7శాతం తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఎడది హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధ ప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్, మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందని చెప్పారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

**త్వరలో ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లు..**

రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ బ్యాంకర్ల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ – ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి

**ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్**

**కార్యక్రమాల వివరాలను వివరించిన జిల్లా అధికారులు**

**బంజారాహిల్స్ బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం**




**హైదరాబాద్, మే 22 (వుదయం ప్రతినిధి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికతో ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారుల సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని సభకు వినిపించారు. సి.ఎం సందేశంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబాటుతో పని చేస్తోందని తెలిపారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ప్రజలకు నేరుగా పాలనను చేరువ చేసే లక్ష్యంతో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన వివరించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, మహిళా సాధికారత వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో సేవా, తయారీ, వ్యవసాయ రంగాలలో తెలంగాణను ప్రపంచ స్థాయిలో ముందంజలో నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఖైరతాబాద్ శాసన సభ్యులు దానం నాగేందర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పెద్ద ఎత్తున ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. తాగునీరు, వైద్యం, విద్య, రేషన్ పంపిణీ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. వేసవి పరిస్థితుల్లోనూ క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న అధికారులను అభినందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరుతున్నాయని తెలిపారు. ఆరోగ్యం, విద్య, రవాణా, పౌరసరఫరాలు, గృహ నిర్మాణం, యువజన సేవల శాఖలు ప్రజల మధ్యకు వెళ్లి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బస్తీ దవాఖానాలు, పెన్షన్ వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. యువతకు మెరుగైన అవకాశాల కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. చార్మినార్ శాసన సభ్యులు మీర్ జుల్ఫికార్ అలీ మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరుతున్నాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని అన్నారు. జూబ్లీహిల్స్ శాసన సభ్యులు నవీన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతోందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు తమ శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతి, పనితీరు, విజయాలను ప్రజాప్రతినిధులు మరియు అధికారులకు వివరించారు. ఇన్‌ఛార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, దివ్యాంగుల సంక్షేమ అధికారి రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల అధికారి గోకుల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పవన్ కుమార్, షేక్‌పేట్ తహసీల్దార్ అనితా రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగ యువతకు ప్రజాప్రతినిధులు నియామక పత్రాలను అందచేసి అభినందనలు తెలిపారు.



## కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్ లో నిమ్స్ రికార్డు

మొదటి పేజీ తరువాయి

నిమ్స్ మూడో స్థానంలో ఉంది. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95శాతం మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడు ఏండ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడులు చేసి రికార్డు నెలకొల్పింది.

# దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలి

మొదటి పేజీ తరువాయి

పచ్చి అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలు, వారు పడుతోన్న ఇబ్బందులపై రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఊరికైనా పోదామన్న కేటీఆర్.. మీరు చెప్తున్నట్లు 80 శాతం పంట కొనుగోళ్లు జరిగాయని నిరూపిస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి భూ దోపిడీ మీద ఉన్న శ్రద్ధ, భూమిని నమ్ముకున్న రైతుల మీద లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల భూ దందా.. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా భూములను ఆక్రమిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వేం నరేందర్ రెడ్డి 'భూ హారతి' పేరుతో కేసముద్రంలో అసైన్డ్ పట్టా భూములను ఆక్రమించారని దుయ్యబట్టారు. శంషాబాద్‌లో సీఎం అనుచరులు ఎమ్మార్వో, కలెక్టర్ స్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చి, ఏకంగా 90 ఎకరాల సీలింగ్ భూమిని ఉత్తర్వుల ద్వారా కేటాయించుకుని రూ. వేల కోట్ల భూ దోపిడీకి తెరలేపారని విమర్శించారు. ఈ బాగోతం అంతా ఏసీబీ దాడిలో దొరికిపోయిందని గుర్తుచేశారు.




**పోక్సో కేసు నిందితుడిని 9 రోజులు దాచారు : కేటీఆర్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కలిసి నిందితుడిని 9 రోజుల పాటు కాపాడారని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఓ మైనర్ బాలికకు అన్యాయం జరిగితే నేషనల్ మీడియాలో వచ్చేంతవరకు తెలుగు మీడియా కనీసం రిపోర్ట్ కూడా చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కొంతమంది వెదవలు దీనిని హనీ ట్రాప్ అని సిగ్గులేకుండా ప్రసారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చారనే సాకుతో నిందితుడిని 9 రోజులు అరెస్ట్ చేయకపోవడం ఏంటని నిలదీశారు. ప్రధాని వస్తే నేరస్థులకు సెలవులు ఇస్తారా.. అని ప్రశ్నించారు. హైకోర్టు బెయిల్ నిరాకరించడంతోనే రేవంత్ రెడ్డి అరెస్ట్ డ్రామాలు, బండి సంజయ్ లొంగుబాటు నాటకాలు ఆడించారని విమర్శించారు. నిందితుడు బండి భగీరథ్‌ను 9 రోజుల పాటు సీఎం బంధువులకు చెందిన మెడికవర్ ఆస్పత్రిలోని 28వ అంతస్తులో దాచారని ఆరోపించారు. బాధితురాలి వివరాలు బయటపెట్టిన బీజేపీ నేతలపై, తప్పుడు కథనాలు రాసిన మీడియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. కొడుకును దాచిపెట్టిన బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ కేసులో మైనర్ బాలికకు న్యాయం జరగాలని పోరాడిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కేటీఆర్ అభినందనలు తెలిపారు.

# రైతు వ్యతిరేకి ప్రభుత్వం








**హైదరాబాద్, మే 22 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలపై దుర్మార్గంగా వ్యవహరిస్తోందని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు వరి కుప్పలపై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం మాత్రం ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేయవద్దంటూ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. టీఆర్ఎస్, శ్రేణులు, మహిళలు, రైతులు ఈ ధర్నా లో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం లేదన్నారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖ పై కనీసం సమీక్ష చేయలేదని మండిపడ్డారు. ధర్నాకు దిగిన కవితతో సహా రైతులు, మహిళలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. మహిళలు, రైతులు అని కూడా చూడకుండా ఓవరాక్షన్ చేశారు. కవితను అరెస్ట్ చేసి ఫలక్ నుమా స్టేషన్ కు తరలించి అనంతరం విడుదల చేశారు.

**వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి**

రాష్ట్ర వ్యాప్తంగా రైతులు వరి కుప్పలపై చనిపోతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని అమె ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 48 డిగ్రీల ఎండలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతుంటే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇది కర్కోటక, అమానవీయ ప్రభుత్వమని మండిపడ్డారు. కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ సర్కార్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలనే తాము సచివాలయం ఎదుట వడ్లు పోసి నిరసన తెలిపామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేయకపోగా తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకే గ్రేడ్ ఏ ధాన్యాన్ని గ్రేడ్ బీ అని రిజిస్టర్ చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్లు కూడా రైతులకు అన్యాయం చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఇక నైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోని రైతుల సమస్యలను పట్టించుకోవాలన్నారు. లేదంటే నేటి నుంచి అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు సహా అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతుల గోసను సీఎం పట్టించుకోవాలని సూచించారు. దళారుల చేతిలో మోసం పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీఎం వ్యవసాయ శాఖ మీద సమీక్ష నిర్వహించి రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్





## డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్ ను తరలించాలి

**: మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్**

**దుండిగల్, మే 22**
**,(వుదయం ప్రతినిధి ),**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా2లో ఉన్న డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని దుండిగల్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆరోపించారు. ఈ మేరకు దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా డంపింగ్ యార్డ్‌లో చెత్తను బహిరంగంగా వేయడం, అనంతరం మంటలు పెట్టడంతో తండా మొత్తం పొగతో కమ్ముకు పోతుందని దీంతో ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, మహిళల్లో గర్భసంచి సంబంధిత అనారోగ్యాలు పెరిగిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గతంలో అప్పటి కమిషనర్ తండాలను మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని, డంపింగ్ యార్డ్ చుట్టూ ప్రహరీ నిర్మించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుల తయారీ చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుతం చెత్తను రోడ్లపై వేస్తూ తగులబెట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని, తండాలోని రోడ్లను శుభ్రం చేసి చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మూడు తండాల ప్రజలతో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

## సచివాలయం వద్ద ఉద్రిక్తత

### రైతుల కోసం సచివాలయం వద్ద టీఆర్ఎస్ ధర్నా కవిత సహా నేతల అరెస్ట్

- **ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల ఆవేదన.. ప్రభుత్వంపై టీఆర్ఎస్ ఆగ్రహం**
- **రైతులు, మహిళలను లాగేస్తూ పోలీసులు ఓవరాక్షన్ చేశారంటూ నీరుడు సర్వేష్ మండిపాటు**

**శంకర్ పల్లి, మే 23 (వుదయం)**



రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం రైతుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ సచివాలయం వద్ద టీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన రైతులు, మహిళలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి వేచి చూస్తూ ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు బాధాకరమని అన్నారు. రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అనవసరంగా తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై స్పందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి రావాలని కోరుతూ సచివాలయం ఎదుట ధర్నాకు దిగినట్లు తెలిపారు. ధర్నా కొనసాగుతుండగా పోలీసులు రంగంలోకి దిగి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవితతో పాటు పలువురు నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. రైతులు, మహిళలు అని కూడా చూడకుండా వారిని లాగేస్తూ అరెస్ట్ చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ధర్నా ప్రదేశంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, టీఆర్ఎస్ నాయకులు పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ నేత నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వెంటనే కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. మహిళలను, రైతులను పోలీసులు అమానుషంగా లాగడం ఓవరాక్షన్‌కు నిదర్శనమని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగే వరకు టీఆర్ఎస్ పోరాటం ఆగదని, రైతుల పక్షాన ఎప్పటికీ నిలబడతామని స్పష్టం చేశారు.

## ప్రజా పాలనతో ప్రజా సమస్యలకు పరిష్కారం



**షాద్ నగర్ మే 22**
**,(వుదయం ప్రతినిధి ),**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో, గ్రామాలలో సమస్యలను నిర్మూలించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే లక్ష్యంగా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం అవతరించిందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, గాంధీ, రైతు కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, రామ్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 99 రోజుల ఈ ప్రణాళికా కార్యక్రమం ఎలా సాగుతుంది అన్నదానిపై చర్చలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు మాట్లాడారు. చిత్తశుద్ధితో పనిచేసే విజయవంతంగా ఈ ప్రణాళిక కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఈ సందర్భంగా సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా మాట్లాడారు.

**పదేళ్లలో రాష్ట్రం అధోగతి పాలు..**
**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రజల ముందు పెట్టి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని ప్రశంసించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడం ఈ కార్యక్రమ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. ఒక రైతు బిడ్డ ముఖ్యమంత్రి అయినందుకు గ్రామాలు పట్టణాలలో ఉండే సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సిద్ధ శుద్ధితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ప్రజల సమక్షంలో, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి పరిష్కారం వైపు వేగంగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచులు గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలపై దృష్టి సారించి ఆ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తారని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని అన్నారు. ప్రజా ప్రతినిధులలో, అధికారులలో జవాబుదారీతనం ఉంటేనే ప్రజా పాలన విజయవంతం అవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో వాస్తవానికి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు నిధులు అందజేయక సర్పంచులు కూడా చాలా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అలాంటి సమస్యలు తీసుకురాదని సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు సహకరించి ప్రజాపాలనను విజయవంతం చేయాలని కోరారు.

అధికారులు సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆయన కోరారు. రాష్ట్రంలో వార్డులు మొదలుకొని జిల్లా కేంద్రాల వరకు ఆశించిన మార్పులు రావాలంటే ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## తడిసిన ధాన్యం.. ఆరిపోతున్న ప్రాణం

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే స్పందించాలి :**
- **కప్పాటి పాండురంగా రెడ్డి**

**చేవెళ్ల మే 22 (వుదయం)**



కప్పాటి పాండురంగా రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన విలేకరుల సమావేశంలో మండిపడ్డారు.జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టీఆర్ఎస్ నాయకుడు కప్పాటి పాండురంగా రెడ్డి డిమాండ్ చేశారు. పలు మండలాల నుంచి రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటికీ, ఇప్పటివరకు 50 శాతం కూడా కొనుగోలు జరగలేదని ఆయన ఆరోపించారు.ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతులను వేధిస్తున్నారని, బాగా ఆరబెట్టిన ధాన్యానికీ 'తేమ ఎక్కువగా ఉంది' అంటూ క్వింటాకు 5 నుంచి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు.కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా లేవని, త్రాగునీరు, నీడ లేక రైతులు, కూలీలు ఎండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.అకాల వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ధాన్యం రక్షణకు అవసరమైన టార్పాలిన్లు కూడా అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అలాగే రైతులు ధాన్యం విక్రయించిన తర్వాత కూడా వారి ఖాతాల్లో డబ్బులు ఎప్పుడు జమ అవుతాయో స్పష్టత లేక తీవ్ర అయోమయం నెలకొన్నదన్నారు. తదుపరి సాగు పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.సన్న రకం వరి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.500 అదనపు బోనస్‌ను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, తేమ శాతం పేరుతో రైతులను వేధిస్తున్న మిల్లర్లు, అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నదాతల కష్టాలను ప్రభుత్వం గుర్తించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.

## స్వచ్ఛందంగా ముందడుగు

### ప్రొద్దుటూరు 3వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం



**శంకర్ పల్లి మే 22 (వుదయం) .**

భూమి పూజ నిర్వహించిన సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహా - వార్డు అభివృద్ధికి అందరి సహకారం అవసరం .మౌలిక సదుపాయాల కల్పనకే ప్రాధాన్యం : ప్రజలకు హామీ ఇచ్చిన అనిత రమేష్ శంకర్ పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలోని 3వ వార్డులో అభివృద్ధి పనులకు మరో అడుగు పడింది. ఆ వార్డు నివాసి నట్టల అనిత రమేష్ తమ సొంత నిధులతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహా ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే వ్యక్తులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా అనిత రమేష్ మాట్లాడుతూ 3వ వార్డులో ఎలాంటి సమస్య వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వార్డు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు ఏనుగు నరేందర్ రెడ్డి, ఎంకెపల్లి మాధవ్, బేగారి సింహం రాజు, కవేలి తిరుపతి రెడ్డి, కోటే ప్రశాంత్, గ్రామ పెద్దలు పట్నం మోహన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మల్లారెడ్డి, కటికె శ్రీనివాస్, పులకండ్ల గోపాల్ రెడ్డి, కొలను శేఖర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అభివృద్ధి పనులను స్వాగతించారు.



## ఆడుతూ పాడుతూ "ఊడ్చేస్తుంటే"

**చీపురు పట్టిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు**

**షాద్ నగర్ మే 22**
**,(వుదయం ప్రతినిధి),**

ఆడుతూ పాడుతూ "ఊడ్చేస్తుంటే" అలుపు సొలుపు ఏమున్నది అంటున్నారు.. చీపురులు పట్టి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు రోడ్లన్నీ శుభ్రంగా ఊడ్చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈరోజు మున్సిపల్ పాలకవర్గం వారి ఆధ్వర్యంలో షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్లు పెంటయ్య,, మురళీమోహన్,

దిలీప్, చందు లాల్, మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది వార్డు ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి ధ్యేయం

**బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్**

**బీరంగూడ మే 22**
**,(వుదయం ప్రతినిధి),**



సమగ్ర అభివృద్ధి కీ అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి ని సాధించాలని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ పేర్కొన్నారు శుక్రవారం బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో గ్రామ అభివృద్ధి విషయాలు ghmc అధికారాలతో ఫోన్ లో మాట్లాడి అభివృద్ధి కార్యక్రమం గురించి అధికారులను పనులు వేగవంతం చేయాలనీ కోరడమైనది. శుంబుణికుంట మరియు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం పై దేవాలయం పవిత్రత దెబ్బటిసే విదంగా మహాశివారాత్రి వంటి దైవ కార్యక్రమం సమయంలో భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా ఎటువంటి నిర్మాణాలు దేవాలయం చుట్టూ పక్కల జరుగకుండా అధికారులకు ప్రజా ప్రతినిధులను కలవాలని నిర్ణయం చేయడం జరిగింది. ఇట్టి సమావేశం లో ఉపాధ్యక్షులు పిర్జపతి సత్యనారాయణ నక్కల కిష్టయ్య ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం కోశాధికారి బంటుశివ కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్ కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్ కుహది ప్రభాకర్ ఎడ్ల అశోక్ మొదలగు వారు పాల్గొన్నారు

## ఉపాధి హామీ, మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం





**రంగారెడ్డి జిల్లా మే 22**
**,(వుదయం ప్రతినిధి),**

ఎంజిఎన్ఆర్ఇజిఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్ ఎఫ్ బిఎస్ (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం), తదితర అంశాలపై బుధవారం హైదరాబాదు నుంచి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్లో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో దివ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగవంతం కావడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని, పూర్తిస్థాయి లో పని దినాలను సద్వినియోగం చేసుకునేలా ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన గుర్తింపును ఇచ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుడిఐడి (యూనిక్యూ డిసేబిలిటీ ఐడెంటిటీ) కార్డులను అర్హులైన వారందరూ పొందేలా అవగాహన కలిగించాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ లో లేబర్ కాంపోనెంట్ అదేవిధంగా వేజ్ కాంపోనెంటు లను ఎట్టి పరిస్థితిలో కూడా ఎంపీడీవోలు త్వరగా కంప్లీట్ చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల భాగంగా 99 డేస్ లో వివో బిల్డింగ్స్ మన జిల్లాలో 287 మంజూరు చేయడం జరిగిందనీ, పనులు ప్రారంభించడం జరిగినది, కానీ ఇంకా 89 వివో బిల్డింగ్స్ కు నిర్మాణ పనులను ప్రారంభించలేదని, మిగిలినవి కూడా ప్రారంభించాలనీ అన్నారు. అదేవిధంగా ఏవైతే ఐడీలు జనరేట్ చేసిక్రాస్ పేమెంట్ ల కోసం కంపల్సరీ కంప్లీట్ చేయవలసిందిగా తెలిపినారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం కింద కుటుంబ పెద్ద చనిపోతే గవర్నమెంట్ ద్వారా 20వేల రూపాయలు ఆ కుటుంబానికి రావడం జరుగుతుంది కాబట్టి ఎంపీడీవోలు పూర్తి స్థాయిలో పని చేసి ఆ కార్యక్రమము పూర్తి చేయాలని ఆదేశించినారు. అదేవిధంగా రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్షిప్ ప్రతి మండలం డ్రైవ్ మోడ్లో 200 మెంబర్లను చేర్పియవలసిందిగా ఆదేశించడం జరిగింది. అదేవిధంగా డిఆర్డిఏ ఈసారి బ్యాంకు లింకేజీ లో బెస్ట్ స్టేట్ లో బెస్ట్ అవార్డు తీసుకున్నందుకు అభినందించడం జరిగింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిఆర్డిఓ పిడి శ్రీలత, డిపిఓ సురేశ్ మోహన్, అడిషనల్ పిడి సుభాషిణి, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తహాశీల్దార్ ఆఫీస్ తలుపునకు వినతిపత్రం

**రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆగ్రహం**

**జిన్నారం మే 22(వుదయం ప్రతినిధి)**



రైతుల సమస్యలపై జిన్నారం తహశీల్దార్ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన బీజేపీ నాయకులకు నిరాశ ఎదురైంది. శుక్రవారం ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయంలో ఎంఆర్, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంకు తాళం వేసి ఉంది.

దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు కార్యాలయం ముందే ధర్నాకు దిగారు. ప్రజల ఆర్జీలు స్వీకరించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అనంతరం ప్రభుత్వ ఉదాసీనతకు నిరసనగా తాళం వేసి ఉన్న చాంబర్ తలుపునకు వినతిపత్రాన్ని అతికించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి కౌన్సిలర్ వెంకటేష్,కో ఆప్షన్ సభ్యుడు నర్సింగరావు మండల శాఖ పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి, నాయకులు రాజిరెడ్డి శ్రీనివాస్ సుధాకర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రకటించిన వేతన పెంపుపై అసంతృప్తి

**శాస్త్రీయంగా లేదంటూ విమర్శలు**
**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. రాజు**

**షాద్ నగర్ మే 22**
**,(వుదయం ప్రతినిధి ),**



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్రెడ్డి గారు ఈ రోజు సచివాలయంలో ప్రెస్మీట్ పెట్టి కార్మిక శాఖ పరిధిలోని షెడ్యుల్డ్ ఎంప్లామెంట్స్లో కనీస వేతనాల పెంపుదలను ప్రకటించారు. సుమారు 14 సం॥ల తరువాత రాష్ట్రంలో కనీస వేతనాలు సవరించడం ఆహ్వానించదగ్గ పరిణామం. 26 జూన్ 2 నుండి సవరించిన వేతనాలు అమలు చేస్తామని ప్రకటించారు. కోటి 11 లక్షల మంది కార్మికులకు పెరిగిన వేతనాలు కూడా 4 క్యాటగిరీలో అన్స్కిల్డ్ వర్కర్కు రూ.16,000/, సెమిస్కిల్డ్ వర్కర్కు రూ.17,000/, స్కిల్డ్ వర్కర్కు రూ.18,500/, హైస్కిల్డ్ వర్కర్కు రూ.20,000/లు పెంచినట్లుగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందులో ఒక్క అన్స్కల్డ్ వర్క్కర్కు తప్ప మిగితా వారికి బేసిక్ కరువుభత్యం కలుపుకొని ఇప్పటికే వస్తున్న జీతానికి పెరిగిన దానికి పెద్ద తేడా లేదు. అవి కూడా జూన్1 కార్పొరేషన్లను ప్రకటించినట్లుగా చెబుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇంకా తగ్గే పరిస్థితి ఉంది. ఉ: కాంట్రాక్టు లేబర్ జీవోనెం 11 ప్రకారం ఇప్పటికే రాష్ట్రంలో రూ.13,098 నుండి 23683 వరకు వేతనాలు పొందుతున్నారు. మరి ప్రభుత్వం పెంచింది పెద్దగా ఏమి లేదు. ప్రస్తుతం అమలులో ఉన్న జీవో నెం 4 తో పోలిస్తే కూడా కొన్ని క్యాటగిరీలలో స్వల్ప పెరుగుదలగాను, కొన్ని క్యాటగిరీలో ప్రస్తుతం పొందుతున్న వేతనం కంటే తగ్గింది. జీవో నెం 4లో స్కిల్డ్ కార్మికుడికి వేతనం రూ.19,572/లు వుండగా ముఖ్యమంత్రి గారు ప్రకటించిన వేతనం రూ. 18,500/లు మాత్రమే. గతంతో పోలిస్తే రూ. 1072/ లు తగ్గింది. దీంతో పాటు బిఆర్ఎస్ ఆధికారంలో వుండగా కనీస వేతనాల సలహామండలి బోర్డు అన్స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనం రూ.18,009/లు, కరువుభత్యాన్ని ఒకొక్క పాయింటికి రూ.12/లు సిపార్సులు చేశారు. దీంతో పాటు 2021 జూన్ 25న అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 5 జీవోలను జారీ చేసింది. వాటికి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేయలేదు. ఇప్పటి వరకు అనుసరించాల్సిన ఏ ప్రామాణీకాన్ని కూడా పరిగణలోకి తీసుకోలేదు. కార్మిక సంఘాలు, కనీస వేతనాల సలహామండలి సిపార్సులను పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం పేరిట కనీస వేతనాలు ప్రకటించారు. ప్రభుత్వం కనీస వేతనం రూ. 26,000/లుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నాం.పెరిగిన ధరలు, 1948 కనీస వేతనాల చట్టం, డాక్టర్ ఆక్రాయి ఫార్ములా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా వేతనాలు పెంచలేదు. శాస్త్రీయంగా లెక్కిస్తే రూ.32,000/లు వస్తుంది. అయినప్పటికినీ కార్మిక సంఘాలు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. కార్మిక సంఘాల డిమాండ్లను పరిగణలోకి తీసుకొని ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను సవరించాలని డిమాండ్ చేస్తున్నాం..

## పురాతన కట్టడాలను సంరక్షణకై శ్రమదానం

**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం రోజున నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో పాలకవర్గ ఆధ్వర్యంలో పురాతన గుడి అయినా శివుని గుడి ఆలయం ఆవరణలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచ్ అంజమ్మ లక్ష్మా గౌడ్ ఆధ్వర్యంలో పురాతన శివుని గుడిలో పిచ్చి మొక్కలు తొలగిస్తూ పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత, గ్రామ ఉప సర్పంచ్ దేవరాజ్, వార్డు మెంబర్ రహీం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బక్కన్న గారి లింగం గౌడ్, ఎండి సలీం, దేవరాజ్, రామ గౌడ్, డి శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE - CITY CIVIL COURT AT HYDERABAD**
**OS. No.1309 OF 2026**

**Between:**
1) Brahmandam Venkata Rama Anjaneya Prasad, S/o. Late Brahmandam Venkata MuraliNath, aged about 60 years, Occupation: Private Employee.
2) Brahmandam Venkata Vidya Sagar, S/o. Late. Brahmandam Venkata MuraliNath, aged about 59 years, Occupation: Private Employee.
3) Brahmandam Partha Saradhi, S/o. Late Brahmandam Venkata MuraliNath, aged about 56 years, Occupation: Private Employee.
4) Kowtha Usha Rani, D/o. Brahmandam Venkata MuraliNath, W/o. Kowtha Raja Shekar, Aged about 52 years, Occupation: House Wife.
The above all are Permanently resident of R/o. H. No. 1-1-364/38, SRT 281, Street No.8, Jawahar Nagar, Chikkadapally, Musheerabad, Hyderabad – 20.
**...Plaintiff**

**AND**

1. The Tahsildhar Musheerabad Mandal & Municipality, Hyderabad Dist.
2. All Concerned.

**PUBLICATION**

Please take that the above named petitioners have filed above suit for declaration of legal heirs of the deceased Brahmandam Venkata MuraliNath Died on 10/12/2025. The said petition was posted on 18/6/2026 for any objections over the petition and for appearance. Your requested to be present before the above-mentioned court on 18/6/2026 at 10.30 a.m. in person or through an advocate. Failing which you will be set exparte, and petition will be proceeded against you in your absence.

***(BY ORDER OF THE COURT)***

**Sd/-**
**K. SIVA KUMAR, # 3rd Floor, Flat No.301, Odeon Enclave, Himayat Nagar, Hyderabad – 29.**
**Cell No. 9848297446**




“ భారతదేశ సరిహద్దుల వెంట భద్రతను పటిష్టం చేయడానికి, అక్రమ చొరబాట్లను అరికట్టడానికి, కేంద్రం ఒక సంవత్సరంలోగా దేశవ్యాప్త స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్టును ప్రారంభించనుంది. జీరో-టాలరెన్స్ విధానాన్ని ప్రకటిస్తూ, భారతదేశ జనాభా సమతుల్యతను కాపాడటానికి దేశంలోకి ప్రవేశించే ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి, వెనక్కి పంపిస్తాం. దేశంలో కృత్రిమ జనాభా మార్పులను సృష్టించే లక్ష్యంతో అక్రమ వలసలు ఒక ప్రణాళికాబద్ధమైన కుట్ర. సాంకేతికత ఆధారిత నిఘా, సమన్వయంతో కూడిన అమలు ద్వారా సరిహద్దులను పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. స్మార్ట్ బోర్డర్ ఫ్రేమ్‌వర్క్ కింద, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భారతదేశపు దాదాపు 6,000 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి ఒక పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ”

- అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

## వేమన పద్యం

హీన గుణమువాని నిలుసేర నిచ్చిన
ఎంతవానికైన నిడుము గలుగు
ఈగ కడుపుజొచ్చి యిట్టట్టు సేయదా?
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# రాజకీయ వనవాసం నుంచి కాంగ్రెస్ ముక్తం

సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడు మంత్రివర్గంలోకి ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యులను చేర్చుకోవడం కేవలం ఒక సాధారణ మంత్రివర్గ విస్తరణ కాదు. ఇది మరింత విశేషమైనది. ఇది దాదాపు ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన కాంగ్రెస్ రాజకీయ వనవాసానికి ముగింపును సూచిస్తుంది. పాలక పక్షమైన తమిళ్ వెట్రి కజగంకు చెందిన 21 మంది మంత్రులతో పాటు ఎస్. రాజేష్ కుమార్, పి. విశ్వనాథన్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఆ దృశ్యం చాటిన సంకేతం అత్యంత స్పష్టం. 1967లో ద్రవిడ రాజకీయాల ఆవిర్భావం నాటి నుండి, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ అధికారం లేని మిత్రపక్షంగానో, లేక అధికారానికి కేవలం ఒక ప్రేక్షకపాత్ర వహించే పార్టీగానో మాత్రమే మిగిలిపోయింది. అడపాదడపా ఏదో ఒక ప్రధాన ద్రవిడ పార్టీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ, కాంగ్రెస్‌ను ప్రభుత్వ అధికార పరిధికి దూరంగానే ఉంచడానికి ఆ పార్టీలు జాగ్రత్తలు తీసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా పునరుజ్జీవింపజేయడం వల్ల కలిగే ముప్పును డిఎంకె, ఎఐఎడిఎంకె అన్న రెండు ద్రవిడ పార్టీలూ గ్రహించాయి. దానికి మంత్రి పదవిని అప్పగించి ఉంటే, జాతీయ పార్టీ కోల్పోయిన రాజకీయ పట్టును తిరిగి పొందగలిగేది. దశాబ్దాలుగా తమిళనాడు సంకీర్ణ రాజకీయాలను ప్రభావితం చేసిన అభద్రతల భారం ఇప్పుడు తక్కువగా కనబడుతున్న నేపథ్యంలో విజయ్ ద్వారా ఆ అలిఖిత ఒప్పందం భగ్నమైంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న విజయ్ వాదనకు మద్దతు ఇచ్చిన తొలి పార్టీ తామేనన్న విషయం కాంగ్రెస్‌కు సంతృప్తినిచ్చింది. కేవలం ఐదు సీట్లతో సంఖ్యాపరంగా దాని సహకారం తక్కువగానే ఉన్నప్పటికీ, రాజకీయంగా ఆ మద్దతుకు బరువు చేకూరి, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి చట్టబద్ధతను కల్పించింది.

ముఖ్యంగా, విజయ్ ఒక సంకుచిత వ్యక్తికేంద్రీకృత పాలన కంటే, విస్తృత ప్రాతిపదిక గల సంకీర్ణాన్ని నిర్మించడానికి నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు 75 సీట్లను కూడా కేటాయించడానికి ఆయన సుముఖత చూపడం, ఎన్నికలకు ముందు ఒక శాశ్వత పొత్తును ఏర్పరచుకోవడానికి ఆయన చేసిన ఒక గంభీరమైన ప్రయత్నాన్ని ప్రతిబింబించింది.

సినిమా పరమైన ఆకర్షణను ఎన్నికల విజయంగా మార్చుకోగల విజయ్ సామర్థ్యాన్ని కాంగ్రెస్ తక్కువగా అంచనా వేసింది. ఒకవేళ ఎన్నికలకు ముందు పొత్తు కుదిరి ఉంటే, తమిళనాడు రాజకీయ సమీకరణాలు నాటకీయంగా భిన్నంగా ఉండేవి. ప్రభుత్వంలో చేరమని విదుతలై చిరుతైగళ్ కచ్చి, ముస్లిం లీగ్ వంటి పార్టీలకు విజయ్ ఆహ్వానం పలకడం, ఆయన కేవలం సంఖ్యాబలంతో ఆధిపత్యం కోసం కాకుండా, అందరినీ కలుపుకొని పోవడం ద్వారా స్థిరత్వాన్ని కోరుకుంటున్నట్లు సూచిస్తోంది. అయితే కాంగ్రెస్‌కు సవాళ్లు మిగిలే ఉన్నాయి. ఏ మంత్రి పదవి కూడా పరిష్కరించలేని ఒక పెద్ద సందిగ్ధతను కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. భారతదేశవ్యాప్తంగా, ప్రాంతీయ పార్టీలు ఒకవైపు బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ ప్రతిపక్షానికి నాయకత్వం వహించాలని ఆశిస్తూనే, మరోవైపు తమ సొంత రాష్ట్రాలలో కాంగ్రెస్ పునరుజ్జీవనాన్ని ప్రతిఘటించాలని చూస్తున్నాయి. ఈ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

జాతీయ స్థాయిలో వామపక్షాలు కాంగ్రెస్‌తో సహకరించినప్పటికీ, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో మాత్రం దానిని తమ ప్రధాన ప్రత్యర్థిగానే పరిగణిస్తాయి. ప్రాంతీయ కూటములు కూడా ఇదే విధమైన ఆందోళనను కలిగి ఉన్నాయి. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, డిఎంకె స్వయంగా పార్లమెంటులో కాంగ్రెస్ నుండి స్పష్టమైన దూరాన్ని పాటించాలని నిర్ణయించుకుంది. ఈ కోణంలో చూస్తే, తమిళనాడు కాంగ్రెస్‌కు ఒక అవకాశాన్ని, అదే సమయంలో ఒక హెచ్చరికను కూడా అందిస్తోంది. ప్రభుత్వంలో భాగస్వామ్యం దాని రాజకీయ ప్రాముఖ్యతను తిరిగి పొందడంలో సహాయపడగలదు, కానీ అది తన సంస్థను పునర్నిర్మించుకుని, క్షేత్రస్థాయిలోని ఓటర్లతో తిరిగి అనుసంధానం అయినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. బీహార్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి ప్రధాన రాష్ట్రాలలో అర్థవంతమైన పట్టును తిరిగి పొందకుండా, భారత రాజకీయాలలో ఒకప్పుడు తనకున్న అగ్రస్థానాన్ని తిరిగి పొందాలని కాంగ్రెస్ ఆశించడం వల్ల ప్రయోజనం ఉండదు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# యువ భారతం మౌన విస్ఫోటనం

**దేశంలో నిరుద్యోగం, పరీక్షా లీకులు, అవినీతి ఆరోపణలు, నియామకాల్లో ఆలస్యం, అవకాశాల్లో అసమానతలు.. ఇవి యువతలో తీవ్ర మానసిక ఆవేదనను పెంచుతున్నాయి. చదువుకున్న యువకుడు ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షలు రాస్తే లీకులు.. ఉద్యోగాలు వస్తే వివాదాలు.. నియామకాలు వస్తే కోర్టు కేసులు.. ఈ చక్రంలో యువత భవిష్యత్తు చిక్కుకుపోయింది. అందుకే ఈ వ్యంగ్య ఉద్యమానికి ఇంత పెద్ద స్పందన వచ్చింది. ఇది కేవలం ఒక పార్టీ పేరు వల్ల కాదు.. దేశ యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తికి ఇది ఒక బహిరంగ రూపం కావడం వల్ల.**

ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక నిజం ఏమిటంటే.. యువత ఒకసారి ఆవేదనతో వీధుల్లోకి దిగితే, అది కేవలం నిరసనగా మిగలదు... దేశ రాజకీయాలనే కదిలించే శక్తిగా మారుతుంది. నిన్న అరబ్ దేశాల్లో యువ ఉద్యమాలు, ఆ తర్వాత శ్రీలంకలో ఆర్థిక సంక్షోభంపై ప్రజా తిరుగుబాటు, ఇటీవల నేపాల్‌లో జెన్-జెడ్ యువత అవినీతి, రాజకీయ అస్థిరత, పాలక వ్యవస్థల వైఫల్యాలపై సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన డిజిటల్ నిరసనలు.. ఇవి అన్నీ ఒకే విషయాన్ని చెబుతున్నాయి. యువతను నిర్లక్ష్యం చేస్తే, వారి అసహనం చివరకు వ్యవస్థలపై ప్రశ్నగా మారుతుంది. భారత్‌లో "కాక్‌రోచ్ జనతా పార్టీ" పేరిట మొదలైన ఈ వ్యంగ్య ఉద్యమం కూడా అదే భావోద్వేగానికి డిజిటల్ రూపంగా కనిపిస్తోంది. బయటికి ఇది మీమ్ సంస్కృతి లాగా కనిపించినా, లోపల మాత్రం నిరుద్యోగం, అవకాశాల కొరత, అవినీతి, పరీక్షా లీకులు, రాజకీయ నిరాశ, వ్యవస్థల పట్ల పెరుగుతున్న అపనమ్మకం బహిరంగంగా వ్యక్తమౌతోంది. యువత మౌన విస్ఫోటనం"గా మారుతున్న ఈ డిజిటల్ వ్యంగ్య ఉద్యమం... దేశంలో నిరుద్యోగం, అవినీతి, అవకాశాల అసమానతలపై పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిధ్వనిగా కనిపిస్తోంది. మే 15, 2026న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన "బొద్దింకలు" వ్యాఖ్య దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. నిరుద్యోగ యువతలో కొందరు మీడియా, సామాజిక మాధ్యమాలు, సమాచార హక్కు కార్యకర్తలుగా మారి వ్యవస్థను దాడి చేస్తున్నారని ప్రచారం జరిగింది. తర్వాత ఆ వ్యాఖ్యను తప్పుగా అర్థం చేసుకున్నారని, నకిలీ డిగ్రీలతో వృత్తుల్లోకి వచ్చిన వారినే ఉద్దేశించానని ఆయన వివరణ ఇచ్చినా, అప్పటికే యువతలో తీవ్ర అసంతృప్తి చెలరేగిపోయింది. అలాంటి వాతావరణంలోనే అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయంలో ప్రజాసంబంధాలపై ఉన్నత విద్య చదువుతున్న అభిజీత్ దీప్కే ఈ వ్యంగ్య రాజకీయ వేదికను ప్రారంభించారు. సామాజిక మాధ్యమాల్లో చేసిన ఒక సాధారణ పోస్టు కొద్ది రోజుల్లోనే దేశవ్యాప్తంగా యువత చర్చించే అంశంగా మారింది. లక్షల మంది యువత దీనిని అనుసరించడం, కోట్ల వ్యూస్ రావడం, వివిధ వేదికలలో వైరల్ కావడం, ఇవి అన్నీ యువతలో ఎంత లోతైన అసంతృప్తి పేరుకుపోయిందో తెలియజేస్తున్నాయి.

### వ్యంగ్యంలో దాగిన వాస్తవం

"సోమరులు, నిరుద్యోగుల గళం"గా ఈ వేదిక తనను తాను పరిచయం చేసుకుంది. దాని ప్రధాన హామీలు కూడా రాజకీయ వ్యవస్థపై వ్యంగ్య బాణాల్లా ఉన్నాయి.

- పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తులకు రాజ్యసభ స్థానాలు ఇవ్వకూడదు
- ఓటు హక్కు తొలగిస్తే ఎన్నికల అధికారిపై చర్యలు తీసుకోవాలి
- మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- కార్పొరేట్ మీడియా అనుమతులను రద్దు చేయాలి
- పార్టీ మారే ఎమ్మెల్యేలు, ఎంపీలకు 20 ఏళ్ల నిషేధం విధించాలి.

సభ్యత్వానికి పెట్టిన అర్హతలు కూడా వ్యంగ్యంతో నిండి వున్నాయి. నిరుద్యోగి కావాలి, ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండాలి, వ్యవస్థను విమర్శించాలి. ఇవన్నీ సరదాగా కనిపించినా, వాస్తవానికి దేశ యువత మనసులో పెరిగిన నిరాశకు ప్రతిబింబమే.

### నేపాల్ నుంచి శ్రీలంక వరకు యువత ఆగ్రహం కొత్తది కాదు

ఇటీవల నేపాల్‌లో యువత అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలు, రాజకీయ అస్థిరతపై డిజిటల్ ఉద్యమాలు చేపట్టింది. సామాజిక మాధ్యమాల ద్వారా పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం సాగింది. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం సమయంలో యువత అధ్యక్ష భవనాల వరకు వెళ్లి నిరసనలు చేపట్టింది. బంగ్లాదేశ్‌లోనూ ఉద్యోగ అవకాశాలు, రాజకీయ నియంత్రణలపై యువ నిరసనలు కనిపించాయి. ప్రపంచవ్యాప్తంగా యువత ఇప్పుడు కేవలం ఓటర్లుగా కాదు... డిజిటల్ యుగంలో ప్రత్యక్ష రాజకీయ శక్తిగా మారుతోంది. భారత్‌లో "కాక్‌రోచ్ జనతా పార్టీ" వైరల్ కావడం కూడా అదే ధోరణికి సంకేతం.

### భారత్ యువతలో గూడుకట్టుకున్న అసహనం

దేశంలో నిరుద్యోగం, పరీక్షా లీకులు, అవినీతి ఆరోపణలు, నియామకాల్లో ఆలస్యం, అవకాశాల్లో అసమానతలు.. ఇవి యువతలో తీవ్ర మానసిక ఆవేదనను పెంచుతున్నాయి. చదువుకున్న యువకుడు ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షలు రాస్తే లీకులు... ఉద్యోగాలు వస్తే వివాదాలు... నియామకాలు వస్తే కోర్టు కేసులు.. ఈ చక్రంలో యువత భవిష్యత్తు చిక్కుకుపోయింది. అందుకే ఈ వ్యంగ్య ఉద్యమానికి ఇంత పెద్ద స్పందన వచ్చింది. ఇది కేవలం ఒక పార్టీ పేరు వల్ల కాదు... దేశ యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తికి ఇది ఒక బహిరంగ రూపం కావడం వల్ల.




**అణచివేత ధోరణులు, అవినీతి, వ్యవస్థల నిర్లక్ష్యం, అవకాశాల్లో అసమానతలు ఇవి ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండవు. ఒక దశలో అవి ప్రజా ఆగ్రహంగా, మరో దశలో డిజిటల్ తిరుగుబాటుగా, ఇంకో దశలో సామాజిక ఉద్యమంగా బయటపడతాయి. "కాక్‌రోచ్ జనతా పార్టీ" కూడా అలాంటి సామాజిక మనస్తత్వ విస్ఫోటానికి సంకేతంగా కనిపిస్తోంది. ఇప్పటికే "కాక్‌రోచ్ జనతా పార్టీ" పేరుపై కొందరు హక్కుల కోసం వేర్వేరు ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు దాఖలు చేయడం, ఈ వ్యంగ్యాన్ని కొందరు సరదాగా కాకుండా ప్రత్యామ్నాయ రాజకీయ భావవ్యక్తీకరణగా చూస్తున్నారనే సంకేతాలను ఇస్తోంది.**

### మీమ్‌ల నుంచి ఉద్యమాల దాకా డిజిటల్ యుగ రాజకీయాలు

ఇప్పుడు రాజకీయాలు కేవలం సభల్లో కాదు... మీమ్‌లలో, చిన్న వీడియోల్లో, సామాజిక మాధ్యమ పోస్టుల్లో తయారవుతున్నాయి. "కాక్‌రోచ్ జనతా పార్టీ" అదే వాస్తవాన్ని బయటపెట్టింది. ఒక వ్యంగ్య పోస్టు దేశవ్యాప్తంగా యువత చర్చించే అంశంగా మారడం, డిజిటల్ ప్రపంచం ఎంత ప్రభావవంతమైందో నిరూపించింది. కేవలం ఐదు రోజుల్లోనే "సీజెపి" ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అనుచరుల సంఖ్య దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలను దాటిపోవడం ఈ అసంతృప్తి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 13.8 మిలియన్ల అనుచరులు ఉండగా, దేశాన్ని దశాబ్దకాలంగా పాలిస్తున్న భారతీయ జనతా పార్టీకి 8.8 మిలియన్ల అనుచరులు ఉన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ఆ పార్టీలకు ఎన్నో సంవత్సరాలు పట్టింది. కానీ కేవలం ఒక ఆవేదన, ఒక వ్యంగ్యం, ఒక డిజిటల్ ఆగ్రహం నుంచి పుట్టిన "సీజెపి" ఖాతా మాత్రం ఆరు రోజుల్లోనే ఆ సంఖ్యలను దాటేసింది. గురువారం ఉదయం వరకు 9 మిలియన్లుగా ఉన్న అనుచరుల సంఖ్య, సాయంత్రానికి 14.5 మిలియన్లకు పెరిగి, అర్ధరాత్రి సమయానికి ఏకంగా 18 మిలియన్ల మార్కును దాటడం కేవలం వైరల్ సంచలనం కాదు... యువతలో పేరుకుపోయిన అసహనం ఎంత లోతుగా ఉందో చెప్పే సామాజిక సంకేతం. అణచివేత ధోరణులు, అవినీతి, వ్యవస్థల నిర్లక్ష్యం, అవకాశాల్లో అసమానతలు ఇవి ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండవు. ఒక దశలో అవి ప్రజా ఆగ్రహంగా, మరో దశలో డిజిటల్ తిరుగుబాటుగా, ఇంకో దశలో సామాజిక ఉద్యమంగా బయటపడతాయి. "కాక్‌రోచ్ జనతా పార్టీ" కూడా అలాంటి సామాజిక మనస్తత్వ విస్ఫోటానికి సంకేతంగా కనిపిస్తోంది. ఇప్పటికే "కాక్‌రోచ్ జనతా పార్టీ" పేరుపై కొందరు హక్కుల కోసం వేర్వేరు ట్రేడ్‌మార్క్ దరఖాస్తులు దాఖలు చేయడం, ఈ వ్యంగ్యాన్ని కొందరు సరదాగా కాకుండా ప్రత్యామ్నాయ రాజకీయ భావవ్యక్తీకరణగా చూస్తున్నారనే సంకేతాలను ఇస్తోంది. అయితే దీని చుట్టూ విమర్శలూ ఉన్నాయి. కొందరు దీనిని ప్రతిపక్ష డిజిటల్ వ్యూహంగా చూస్తుండగా, మరికొందరు ఇది నిజమైన యువ ఆవేదన అంటున్నారు. కానీ ఏ కోణంలో చూసినా ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.. యువత ఇప్పుడు మౌనంగా ఉండటానికి సిద్ధంగా లేదు. న్యాయవ్యవస్థ-యువత మధ్య పెరుగుతున్న భావోద్వేగ దూరం. ఈ సంఘటన మరొక ప్రమాదకర సంకేతాన్ని కూడా చూపిస్తోంది. యువత మరియు దేశ వ్యవస్థల మధ్య భావోద్వేగ దూరం పెరుగుతోంది. ఒక వ్యాఖ్యపై యువత ఇంత తీవ్రంగా స్పందించడం వెనుక, వారి మనసులో పేరుకుపోయిన అసహనం దాగి ఉంది. ప్రజాస్వామ్యంలో యువత నమ్మకం కోల్పోతే, అది కేవలం రాజకీయ సమస్య కాదు... దేశ భవిష్యత్తుకే హెచ్చరిక.

### ఇది నవ్వు కాదు.. భవిష్యత్తుపై భయం

"కాక్‌రోచ్ జనతా పార్టీ" ఒక రోజు ట్రెండ్ కావచ్చు. కొన్ని వారాల్లో మరిచిపోవచ్చు కూడా, కానీ దాని వెనుక ఉన్న యువత ఆవేదన మాత్రం అంత తేలికగా మాయమవదు. చేతిలో డిగ్రీలు... కళ్లలో కలలు... కానీ ముందున్న భవిష్యత్తు మాత్రం మసకబారినదే. వ్యంగ్యం ద్వారా నవ్వుతున్న యువత, వాస్తవానికి తమ బాధనే ప్రపంచానికి వినిపిస్తోంది. ఈ సంకేతాన్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, న్యాయ వ్యవస్థ, విద్యా వ్యవస్థ.. అన్నీ నిర్లక్ష్యం చేస్తే, రేపటి రోజుల్లో ఈ డిజిటల్ అసహనం మరింత పెద్ద సామాజిక ఉద్యమాలుగా మారే అవకాశం ఉంది. **యువతను ఎగతాళి చేయడం కాదు..** వారి మనసులోని మౌనాన్ని అర్థం చేసుకోవాలి. వారికి అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుపై నమ్మకం కలిగించాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యం.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్
9010128884)



# ప్రకృతితో ప్రేమలో పడితే చాలు

మనం జీవిస్తున్న ఆధునిక ప్రపంచం ఒక వింతైన, అంతులేని పరుగు పందెంలో ఉంది. ఈ పరుగులో మనిషి పక్కన ఉన్న తోటి మనిషిని దాటిపోవాలని చూస్తున్నాడు, వీలైతే తనను సాకుతున్న ప్రకృతిని కూడా లొంగదీసుకోవాలని చూస్తున్నాడు. మనిషి, సమాజం, ప్రకృతి ఈ మూడు అస్తిత్వాల మధ్య ఒకప్పుడు ఒక మధురమైన అనుబంధం ఉండేది. ప్రకృతి అనేది ఒక సజీవ గర్భం అయితే, అందులో జన్మించిన శిశువు మనిషి, ఆ శిశువులు కలిసి ఆడుకునే ఆటస్థలం సమాజం. కానీ నేడు ఆ రాగం అపశృతిగా మారింది. పర్యావరణ పరిరక్షణ గురించి ఈరోజు ప్రపంచవ్యాప్తంగా సభలు జరుగుతున్నాయి, చట్టాలు వస్తున్నాయి, కోట్లాది రూపాయల బడ్జెట్లు కేటాయిస్తున్నారు. కానీ, ఇవన్నీ భయం నుండి పుడుతున్నవే తప్ప హృదయం నుండి కాదు. ఈ తరుణంలో ప్రముఖ తాత్వికుడు ఓషో చెప్పిన ఒక చిన్న సూత్రం మనల్ని తీవ్రంగా ఆలోచింపజేస్తుంది. "మనం ప్రకృతిని రక్షించాల్సిన అవసరం లేదు, ప్రకృతితో ప్రేమలో పడితే చాలు. మనం ప్రేమించే దాన్ని మనం ఎప్పటికీ నాశనం చేయలేం."

భయం కాదు, ప్రేమే మార్గం. ఈరోజు సమాజం పర్యావరణాన్ని కాపాడాలని మాట్లాడుతోంది. ఎందుకు..? "రేపు నీరు దొరకదు, గాలి దొరకదు, మానవాళి అంతమైపోతుంది" అనే భయం వల్ల..! తాత్విక కోణంలో చూస్తే, భయం ఎప్పుడూ తాత్కాలికమైనదే. భయం ఉన్నచోట స్వార్థం ఉంటుంది తప్ప సమర్పణ ఉండదు. ఓషో దృష్టిలో ప్రకృతి అంటే కేవలం భౌతికమైన వనరుల కూర్పు కాదు; అది భగవంతుడి బాహ్య రూపం. మనిషి తన అహాన్ని (ఈగో) సంతృప్తి పరుచుకోవడానికి ప్రకృతిని లోబరుచుకోవాలని చూస్తున్నాడు. ఒక పర్వతాన్ని చూసినప్పుడు తాత్వికుడు దాని అందాన్ని చూసి పరవశిస్తాడు. కానీ, ఆధునిక మనిషి దాన్ని పగలగొట్టి గ్రానైట్ రాళ్లుగా ఎలా మార్చాలా అని లెక్కిస్తాడు. ఒక అందమైన నదిని చూస్తే, అందులో మైనింగ్ ఎలా చేయాలా అని ఆలోచిస్తాడు. ఒక చెట్టును చూసినప్పుడు దాన్ని కేవలం ఒక 'కలప' లాగానో, ఒక నదిని చూసినప్పుడు దాన్ని 'ఫ్యాక్టరీ వ్యర్థాలను పారబోసే కాలువ' లాగానో చూడటం మన అహానికి నిదర్శనం. అదే మనిషి ప్రకృతితో ప్రేమలో పడితే... చెట్టులో దైవత్వాన్ని చూస్తాడు, నది ప్రవాహంలో జీవన నాదాన్ని వింటాడు. ఒక తల్లి తన బిడ్డను పెంచడాన్ని ఒక 'బాధ్యత' లాగానో, చట్టం చెప్తుందనో చేయదు. ఆమె ఆ బిడ్డతో ప్రేమలో ఉంటుంది కాబట్టే, ఎంత కష్టమైనా ఆనందంగా ఆ బిడ్డను సాకుతుంది. ప్రకృతి పట్ల మనిషికి, సమాజానికి కావాల్సింది సరిగ్గా ఈ 'మాతృ హృదయమే'. సమాజం అనేది ప్రకృతికి లోబడి ఉండాల్సిన ఒక వ్యవస్థ. ప్రకృతి మనిషికి 'స్వేచ్ఛను' ఇస్తే, సమాజం 'కట్టుబాట్లను' ఇస్తుంది. దురదృష్టవశాత్తు, నేటి ఆధునిక సామాజిక పోకడలు మనిషిని ఒక వినియోగదారుడుగా, ఒక యంత్రంగా మార్చేశాయి. ప్రకృతి సహజ సిద్ధమైన గుణాలను సమాజం శైశవదశ నుంచే తుంచేస్తోంది.

*ప్రకృతి కంటే భిన్నమైన వాళ్లం కాదు. చెట్టు శ్వాస విడిస్తేనే మనం శ్వాస తీసుకోగలం. నది ప్రవహిస్తేనే మన రక్తం ప్రవహిస్తుంది. ప్రకృతి ఏనాడూ మనిషిని వెలివేయలేదు. మనం ఎంతగా గాయపరిచినా, వసంతం రాగానే చెట్లు మళ్లీ పూలు పూస్తూనే ఉన్నాయి. ఈ అపారమైన కరుణను అర్థం చేసుకున్నప్పుడే మనిషి తన అహాన్ని వీడి అస్తిత్వంలోకి మారతాడు. ఇప్పటికైనా సమాజం తన ఆర్థిక సూత్రాలను ప్రకృతి నియమాలకు అనుగుణంగా మార్చుకోవాలి.*

ఒక చిన్న పిల్లాడిని చూడండి. వాడు వర్షం పడితే కాగితం పడవలు వేస్తాడు, మట్టిలో ఆడుకుంటాడు, చెట్లను తాకుతాడు. అది ప్రకృతి సహజ సిద్ధమైన గుణం. కానీ సమాజం (తల్లిదండ్రులు, పాఠశాల) ఏం చేస్తుంది..? "మట్టి అంటుకుంటుంది దూరం రా, వర్షంలో తడిస్తే జ్వరం వస్తుంది లోపలికి రా" అంటూ వాడిని నాలుగు గోడల మధ్య బంధించి, కంప్యూటర్ స్క్రీన్ల ముందు కూర్చోబెడుతుంది. ఇలా ప్రకృతికి దూరమైన పిల్లవాడు రేపు పెద్దయ్యాక సమాజంలో ఒక యాంత్రిక జీవిగా మారిపోతున్నాడు. ఒకప్పుడు పల్లెల్లో పెద్ద చెట్టు కింద రచ్చబండ ఉండేది. అక్కడ ప్రకృతి (చెట్టు నీడ, స్వచ్ఛమైన గాలి) సాక్షిగా, సమాజం (గ్రామస్తులు) కూర్చుని, మనిషి తన కష్టసుఖాలను పంచుకునేవాడు. అక్కడ మానసిక ఒత్తిడి అనే పదానికి చోటు ఉండేది కాదు. కానీ నేడు నగరాల్లో వందల అడుగుల ఎత్తున కాంక్రీట్ అపార్ట్‌మెంట్లు వచ్చాయి. మనిషి ఏసీ రూమ్‌లో ఉంటాడు, ఏసీ కార్లలో తిరుగుతాడు, ఏసీ ఆఫీసుల్లో పని చేస్తాడు. ఇదే సందర్భంలో పక్క ఫ్లాట్‌లో ఎవరుంటున్నారో తెలియని సామాజిక శూన్యత, ప్రకృతి లేని కృత్రిమత్వం ఏర్పడ్డాయి. ఫలితంగా మనిషి మానసిక రోగిగా మారుతున్నాడు. అంతేకాదు ప్రకృతిని దూరం చేసుకుంటే సమాజం విచ్ఛిన్నమవుతుంది, సమాజం విచ్ఛిన్నమైతే మనిషి మానసికంగా కుప్పకూలిపోతాడు. సైకియాట్రిస్టుల దగ్గరకు వెళ్లే ఆధునిక మనుషులకు ఓషో ఇచ్చే చికిత్స ఏంటంటే "వెళ్లి కాసేపు చెప్పులు విప్పి పచ్చటి గడ్డిపై నడువు, ఒక చెట్టును గట్టిగా కౌగిలించుకో, నీ ఒంటరితనం మాయమవుతుంది." ఎందుకంటే ప్రకృతి మనకు 'సహనం' నేర్పితే, సమాజం మనకు 'సహజీవనం' నేర్పుతుంది అంటారు. మనం ఇప్పుడు ఒక చారిత్రాత్మక జంక్షన్‌లో నిలబడ్డాం. కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతరిక్ష యాత్రలు, టెక్నాలజీ ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ కాలంలో, రోజంతా స్క్రీన్లతో మాట్లాడుతున్న మనిషి... కాసేపు పక్కన ఉన్న తోటి మనిషితో, చుట్టూ ఉన్న ప్రకృతితో మాట్లాడటం నేర్చుకోవాలి. తన కాళ్ళ కింద ఉన్న నేలను, చుట్టూ ఉన్న సమాజాన్ని విస్మరిస్తే ఆ విజయాలకు అర్థం లేదు. అందుకే "ప్రకృతితో ప్రేమలో పడాలి" అనేది ఒక తాత్కాలిక నినాదం కాదు, అది ఒక అంతర్గత విప్లవం. మనం ప్రకృతిలో భాగమే తప్ప, ప్రకృతి కంటే భిన్నమైన వాళ్లం కాదు. చెట్టు శ్వాస విడిస్తేనే మనం శ్వాస తీసుకోగలం. నది ప్రవహిస్తేనే మన రక్తం ప్రవహిస్తుంది. ప్రకృతి ఏనాడూ మనిషిని వెలివేయలేదు. మనం ఎంతగా గాయపరిచినా, వసంతం రాగానే చెట్లు మళ్లీ పూలు పూస్తూనే ఉన్నాయి. ఈ అపారమైన కరుణను అర్థం చేసుకున్నప్పుడే మనిషి తన అహాన్ని వీడి అస్తిత్వంలోకి మారతాడు. ఇప్పటికైనా సమాజం తన ఆర్థిక సూత్రాలను ప్రకృతి నియమాలకు అనుగుణంగా మార్చుకోవాలి. మనిషి తన హృదయ కవాటాలను తెరిచి, ప్రకృతిని ఆలింగనం చేసుకోవాలి. ప్రకృతి నిశ్శబ్ద సంగీతాన్ని వింటూ, సమాజాన్ని గౌరవిస్తూ సహజీవనం సాగించిన రోజే ఈ భూమిపై మానవ ఉనికికి నిజమైన సార్థకత, పరమార్థం లభిస్తాయి.



రాజేందర్ దామెర

# బౌండరీల బంధాలు

మానవ పరిణామ క్రమంలో 'కుటుంబం' అనే వ్యవస్థను నిలబెట్టడానికి ఏర్పడిన అత్యంత బలమైన సాధనం వివాహం. అయితే, ఆధునిక కాలంలో వివాహం అనే 'నిర్మాణం' పటిష్టంగానే కనిపిస్తున్నా, అందులో ఉండాల్సిన ప్రేమ, స్నేహం అనే 'నివాసం' మాత్రం శిథిలమవుతోంది. చట్టబద్ధమైన పత్రాలు, సామాజిక ఆమోదాల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేటి సంబంధాలను తాత్విక కోణంలో పరిశీలించుకొవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివాహ బంధంలో ప్రేమ, స్నేహం లేకపోవడాన్ని తాత్విక పరిభాషలో 'అస్తిత్వ సంక్షోభం' గా పరిగణించవచ్చు. శాస్త్రీయంగా చూస్తే, ఇది కేవలం రెండు శరీరాల మధ్య జరిగే ఒక 'లావాదేవీ' మాత్రమే. ఇక్కడ బాధ్యత ఉంటుంది కానీ ఆత్మీయత ఉండదు, అవసరం ఉంటుంది కానీ ఆరాధన ఉండదు. సూటిగా చెప్పాలంటే ఒక యంత్రానికి ఇంధనం లేకపోతే అది ఎలాగైతే మొద్దుబారిపోతుందో, స్నేహం లేని వివాహం కూడా అలాగే యాంత్రికంగా మారుతుంది. ఇక్కడ 'నిశ్శబ్దం' అనేది ప్రశాంతతకు చిహ్నం కాదు, అది మాటలు చచ్చిపోయిన స్థితికి సంకేతం. సైకాలజీ ప్రకారం, ఇటువంటి బంధాల్లో ఉన్న వ్యక్తులు 'ఒంటరితనం కంటే భయంకరమైన సామీప్యతను' అనుభవిస్తారు. ఇది మనిషిలోని సృజనాత్మకతను, జీవితేచ్ఛను నెమ్మదిగా హరించివేస్తుంది. మరోవైపు, వివాహం అనే సామాజిక ముద్ర లేకపోయినా, కేవలం ప్రేమ, స్నేహాల పునాదులపై నిలబడే బంధం అత్యంత శక్తివంతమైనదిగా ఉంటుంది. ఎటువంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు లేని చోట, ఒక వ్యక్తి మరొకరితో కలిసి ఉంటున్నారంటే, అది కేవలం వారి ఆత్మల మధ్య ఉన్న సామరస్యం వల్లే సాధ్యమవుతుంది. ఇక్కడ మానసిక స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఒకరిని ఒకరు నియంత్రించాలనే కోరిక కంటే, ఒకరి ఎదుగుదలలో మరొకరు భాగస్వాములు కావాలనే తపన ఉంటుంది. అరిస్టాటిల్ చెప్పినట్లు, "స్నేహం అనేది రెండు శరీరాల్లో నివసించే ఒకే ఆత్మ". అటువంటి స్నేహం ఉన్నచోట వివాహ పత్రం లేకపోయినా, ఆ బంధం కాలాతీతంగా నిలుస్తుంది. వివాహం అనేది ఒక 'అద్దం' లాంటిదని చెప్పొచ్చు. అది సంబంధానికి ఒక రూపాన్ని ఇస్తుంది. కానీ అందులో కనిపించే 'ప్రతిబింబం' మాత్రం ప్రేమ, స్నేహాలే. అద్దం ఉండి ప్రతిబింబం లేకపోతే అది శూన్యం. అద్దం లేకపోయినా ప్రతిబింబం (అనుభూతి) ఉంటే, అది కంటికి కనిపించని సత్యం. అందుకే కావాల్సింది కేవలం 'వివాహాలు' కాదు, పరస్పర గౌరవం, స్నేహం ప్రాతిపదికన ఏర్పడే 'సుదృఢ అనుబంధాలు'. బంధం బాధ్యతగా కాకుండా, ఒక మధురమైన ప్రయాణంగా మారినప్పుడే మనిషి అస్తిత్వానికి పరిపూర్ణత లభిస్తుంది. వ్యవస్థల కంటే విలువలకే పెద్దపీట వేయాల్సిన సమయం ఇది. స్నేహం, ప్రేమ కలిగిన బంధంలో వివాహం లేకపోయినా, వివాహ బంధంలో మాత్రం ఖచ్చితంగా ప్రేమ, స్నేహం ఉండాలి. అలా ఉంటేనే ఆ వివాహ బంధం నిలబడుతుందనేది సత్యం.

కస్తూరిదారా



# జాతీయం-అంతర్జాతీయం



## స్మార్ట్ బోర్డర్ ప్రణాళికను అమలు చేస్తాంః హోం మంత్రి అమిత్ షా



**అక్రమ వలసదారులపై ఉక్కు చర్యలు తీసుకుంటాం**

**న్యూఢిల్లీ, మే 22 (వుదయం)ః**
భారతదేశ సరిహద్దుల వెంట భద్రతను పటిష్టం చేయడానికి, అక్రమ చొరబాట్లను అరికట్టడానికి, కేంద్రం ఒక సంవత్సరం లోగా దేశవ్యాప్త స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్టును ప్రారంభించనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ప్రకటించారు.
జీరోటాలరెన్స్ విధానాన్ని ప్రకటిస్తూ, భారతదేశ జనాభా సమతుల్యతను కాపాడటానికి దేశంలోకి ప్రవేశించే ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి, వెనక్కి పంపిస్తామని హోం మంత్రి అన్నారు.
విజ్ఞాన్ భవన్‌లో జరిగిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ప్రమాణ స్వీకార కార్యక్రమం 2026లో ఆ దళ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశంలో కృత్రిమ జనాభా మార్పులను సృష్టించే లక్ష్యంతో అక్రమ వలసలు ఒక ప్రణాళికాబద్ధమైన కుట్ర అని షా అభివర్ణించారు.
సాంకేతికత ఆధారిత నిఘా, సమన్వయం తో కూడిన అమలు ద్వారా సరిహద్దులను పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఉద్ఘాటించారు.
ప్రతిపాదిత స్మార్ట్ బోర్డర్ ఫ్రేమ్‌వర్క్ కింద, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ భారతదేశపు దాదాపు 6,000 కిలోమీటర్ల అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి ఒక పటిష్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది.బిఎస్ ఎఫ్ సామర్థ్యాలను పెంపొందించేందుకు, ఈ ప్రాజెక్టులో భాగంగా డ్రోన్ రాడార్లు, హైరిజల్యూషన్ కెమెరాలు, ఇతర ఆధునిక పర్యవేక్షణ సాంకేతికతలు వంటి అధునాతన నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా, చొరబాటు మార్గాలను గుర్తించి, సరిహద్దుల గుండా జరిగే పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు, రాష్ట్ర పోలీసులు, జిల్లా యంత్రాంగాలు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పనిచేస్తూ, సరిహద్దు అవుట్‌పోస్టులకు ఆవల తమ నిఘా వ్యవస్థను విస్తరించాలని షా బిఎస్ ఎఫ్‌ను ఆదేశించారు.భద్రతా గ్రిడ్‌ను అమలు చేయడంలో పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర ప్రభుత్వాలతో సమన్వయం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. విధానపరమైన అంశాలలో పూర్తి ఏకీభావం కలిగిన ఈ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు.
వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం చేపడుతున్న ప్రచారంతో పోలుస్తూ, కేవలం చొరబాట్లను నియంత్రించడం సరిపోదని, ఈ సమస్యను మూలాల నుంచే నిర్మూలించడానికి కృషి చేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. సరిహద్దుల వెంబడి మోహరించిన సిబ్బందికి మద్దతుగా త్వరలో ఒక ఉన్నత స్థాయి జనాభా అధ్యయన మిషన్‌ను (హైపవర్ డెమోగ్రఫీ మిషన్) ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు.దేశ రక్షణలో బిఎస్ ఎఫ్ పోషిస్తున్న పాత్రను ప్రశంసిస్తూ, 1965లో ఆవిర్భవించినప్పటి నుండి ఈ దళం జాతీయ భద్రతకు, దృఢత్వానికి ఒక ప్రతీకగా నిలిచిందని కేంద్ర హోం మంత్రి పేర్కొన్నారు.కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభమైన బిఎస్ ఎఫ్,ప్రస్తుతం సుమారు 2.7 లక్షల మంది సిబ్బందితో కూడిన భారీ దళంగా విస్తరించిందని, ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షక దళంగా గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు.
దేశంలోని అత్యంత క్లిష్టమైన కొన్ని సరిహద్దులలో బీఎస్ఎఫ్ ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఆ దళం ధైర్యసాహసాలతో, త్యాగాలతో భారతదేశ సార్వభౌమత్వాన్ని నిరంతరం కాపాడిందని షా అన్నారు.విధి నిర్వహణలో ఆదర్శప్రాయమైన సేవ, అత్యున్నత త్యాగం చేసిన బీఎస్ఎఫ్ సిబ్బందిని హోం మంత్రి సత్కరించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.




## 10 రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు

**న్యూఢిల్లీ, మే 22 (వుదయం)ః**
పది రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలను నిర్వహించనున్నట్టు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రస్తుత సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో, జూన్, జూలై నెలల్లో మొత్తం 24 స్థానాలు ఖాళీ కానున్నాయి. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ వంటి ప్రముఖ నాయకుల స్థానాలు కూడా వీటిలో ఉన్నాయి.
ఎన్నికలు, ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, జూన్ 1 నుండి జూన్ 8 మధ్య నామినేషన్లు దాఖలు చేయవచ్చు. జూన్ 18న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కాగా, సాయంత్రం 5 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.తమిళనాడు, మహారాష్ట్రలలో రాజీనామాల కారణంగా ఒక్కో స్థానం ఖాళీ అయ్యింది. మే 7న ఒక ఎంపీ రాజీనామా చేయడంతో తమిళనాడు స్థానం ఖాళీ కాగా, మే 6న మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సిపి అధ్యక్షురాలు సునేత్ర అజిత్ పవార్ రాజీనామా చేయడంతో మహారాష్ట్ర స్థానం ఖాళీ అయ్యింది. తన భర్త, మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి మరణానంతరం జరిగిన బారామతి అసెంబ్లీ ఉప ఎన్నికలో సునేత్ర పవార్ ఈ స్థానాన్ని గెలుచుకున్నారు.లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కాకుండా, రాజ్యసభ ఎన్నికలలో ఓటింగ్ ఇవిఎంలకు బదులుగా బ్యాలెట్ పత్రాల ద్వారా నిర్వహిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఎమ్మెల్యేలు తమ ఓటును బ్యాలెట్ పత్రంపై ముందే అమర్చిన ఊదా రంగు స్కెచ్ పెన్‌ను ఉపయోగించి గుర్తించాల్సి ఉంటుంది.
గుజరాత్‌లో ఐదు స్థానాలకు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో చెరో నాలుగు స్థానాలకు, మధ్యప్రదేశ్‌లో మూడు స్థానాలకు, జార్ఖండ్‌లో రెండు స్థానాలకు, అలాగే మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరామ్‌లలో చెరో ఒక స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. వీటికి అదనంగా, మహారాష్ట్ర, తమిళనాడులలో చెరో ఒక స్థానానికి ఉప ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు.

## మంత్రి మండలితో ఫలప్రదమైన సమావేశం

**భేటీ అనంతరం ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ, మే 22 (వుదయం)ః**
అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న సంక్షోభం, భారతదేశం తన దీర్ఘకాలిక ఇంధన భద్రతా వ్యూహాన్ని పునఃసమీక్షించుకునేలా ప్రేరేపించినట్లు కనిపిస్తోంది.
చమురు ఎగుమతి చేసే దేశాల నుండి భవిష్యత్తులో ఇంధన సరఫరాలకు అంతరాయాలు ఏర్పడే అవకాశంపై ఆందోళన చెందుతున్న ఎన్డీఏ ప్రభుత్వం, ఇంధన రంగంలో భారతదేశ స్వావలంబనను బలోపేతం చేసే లక్ష్యంతో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం ప్రారంభించినట్లు తెలిసిందని, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది.
గురువారం సాయంత్రం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో, సౌరశక్తి, బయోమాస్, బయోగ్యాస్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను విస్తరించడం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నొక్కిచెప్పినట్లు సమాచారం.
దిగుమతి ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ప్రపంచ భౌగోళిక రాజకీయ ఒడిదుడుకుల నుండి దేశాన్ని కాపాడగల సుస్థిరమైన, స్వదేశీ ఇంధన పరిష్కారాలను చురుకుగా ప్రోత్సహించాలని ప్రధానమంత్రి మంత్రులను కోరినట్లు తెలిసింది.ఈ సమావేశంలో, 2047 నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న తన ప్రభుత్వ విస్తృత దార్శనికతను నరేంద్ర మోడీ మరోసారి పునరుద్ఘాటించారు.
వికసిత్ భారత్ నిర్మాణమనే జాతీయ లక్ష్యాన్ని సాధించే దిశగా మిషన్ మోడ్ లో తమ కృషిని కొనసాగించాలని, అదే సమయంలో మారుతున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగానే పాలన సాగేలా చూసుకోవాలని ఆయన తన మంత్రివర్గ సహచరులను ఆదేశించారు.నిన్న మంత్రివర్గ సమావేశం ఫలవంతంగా జరిగింది. జీవన సౌలభ్యం, వ్యాపార సౌలభ్యాలను పెంపొందించడం, అలాగే వికసిత భారత్ అనే మన ఉమ్మడి కలను సాకారం చేసుకునేందుకు సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఎలా అనే విషయాలపై మేము అభిప్రాయాలను, ఉత్తమ పద్ధతులను పరస్పరం పంచుకున్నామని ప్రధాని సమావేశం జరిగిన మరురోజు (శుక్రవారం) ఎక్స్‌పై పోస్టు చేశారు. పెంపొందించడం, అలాగే వికసిత భారత్ అనే మన ఉమ్మడి కలను సాకారం చేసుకునేందుకు సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఎలా అనే విషయాలపై మేము అభిప్రాయాలను, ఉత్తమ పద్ధతులను పరస్పరం పంచుకున్నామని ప్రధాని సమావేశం జరిగిన మరురోజు (శుక్రవారం) ఎక్స్‌పై పోస్టు చేశారు.

ఉన్నత స్థాయి సమావేశంలో చర్చలు ప్రధానంగా జీవన సౌలభ్యం, వ్యాపార సౌలభ్యంను మెరుగుపరచడంపై కేంద్రీకృతమయ్యాయి. ఈ అంశాలు ప్రభుత్వ పాలనా ఎజెండాలో ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి.అన్ని రంగాలలో సంస్కరణలను వేగవంతం చేయాలని, తద్వారా నూతన ఉత్సాహంతో అభివృద్ధి వేగాన్ని మరింత బలోపేతం చేయవచ్చని ప్రధానమంత్రి పిలుపునిచ్చినట్లు సమాచారం.పెట్రోలియం, ఆర్థిక మంత్రులు సహా కీలక మంత్రులు వివరణాత్మక ప్రెజెంటేషన్లను, తమ రంగాలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌లను సమర్పించారు.పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో, గృహ వంట అవసరాల కోసం ఎల్‌పిజికి ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్‌ను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు.ఇంధన సంబంధిత సమస్యలతో పాటు, వ్యవసాయం, అటవీ, కార్మిక, రహదారి రవాణా, కార్పొరేట్ వ్యవహారాలు, విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం, విద్యుత్ వంటి కీలక రంగాలపై కూడా ప్రెజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రులు సుస్థిర జాతీయ అభివృద్ధి కోసం తమ ప్రాధాన్యతలను, భవిష్యత్ వ్యూహాలను వివరించారు.

## ఎవరెస్ట్ పర్వతం దిగుతూ ఇద్దరు భారతీయుల మృతి



**వుదయం డెస్క్, మే 22ః**
మౌంట్ ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మరణించారని నేపాల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వార్తా సంస్థ పిటిఐ నివేదిక ప్రకారం, ఆ ఇద్దరూ పర్వత శిఖరాన్ని అధిరోహించి, తిరిగి వస్తుండగా ప్రాణాలు కోల్పోయారు.
అలసటతో మరణం
నేపాల్ ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ రిషి భండారి ప్రకారం, పర్వత శిఖరం నుండి కిందకు దిగుతున్నప్పుడు పర్వతారోహకులలో ఒకరు తీవ్రంగా అలసిపోయారు. షెర్పా గైడ్‌లు అతనికి సహాయం చేయడానికి తమ శక్తివంచన లేకుండా ప్రయత్నించి, రాత్రంతా బాల్కనీ నుండి సౌత్ కోల్‌కు తీసుకువచ్చినప్పటికీ, అతన్ని కాపాడలేకపోయారు. పర్వతంపై ఉన్న షెర్పా గైడ్‌లు ప్రయత్నించినప్పటికీ, అతను ప్రాణాలు కోల్పోయాడు అని ఆయన తెలిపారు.
పర్వతంపై మరణించిన రెండవ భారతీయుడి గురించి ప్రస్తావిస్తూ, అతనిని అరుణ్ తివారీగా గుర్తించినట్లు భండారి తెలిపారు. గురువారం సాయంత్రం సుమారు 5:30 గంటలకు అతను ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాడు. అతని గురించి ఆ అధికారి మాట్లాడుతూ, అతనికి ఇద్దరు అనుభవజ్ఞులైన షెర్పా గైడ్లు తోడుగా ఉన్నారు. వారందరూ కలిసి కిందకు దిగడానికి ప్రయత్నిస్తుండగా, హిల్లరీ స్టెప్ వద్ద అతను తీవ్రంగా అలసిపోయాడని, దాంతో తమ గైడ్లు అతన్ని వెనక్కి తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు.
నలుగురు షెర్పా గైడ్‌ల సహాయం పొందుతున్న సమయంలోనే, హిల్లరీ స్టెప్ సమీపంలో తివారీ మరణించారు. మరణించిన వారిలో మొదటి వ్యక్తిని సందీప్ ఆరేగా గుర్తించారు. షెర్పా గైడ్‌లు క్యాంప్ 2కి తీసుకువచ్చిన తర్వాత, ఆయన మరణించారు.21 ఏళ్ల సానికా షా, సరిహద్దు భద్రతా దళం (బిఎస్ ఎఫ్) మహిళా పర్వతారోహక బృందంతో సహా పలువురు భారతీయులు ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన సమయంలోనే, ఈ రెండు మరణాలు సంభవించడం గమనార్హం.
ఈ సంవత్సరం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి నేపాల్ 493 అనుమతులను జారీ చేసింది. 1953లో టెన్జింగ్ నార్గే, సర్ ఎడ్మండ్ హిల్లరీ ఈ పర్వతాన్ని అధిరోహించినప్పటి నుండి, ఆ దేశం జారీ చేసిన అనుమతులలో ఇదే అత్యధిక సంఖ్య కావడంతో, దీనిని ఒక రకంగా రికార్డుగానే పరిగణిస్తున్నారు. కేవలం బుధవారం ఒక్కరోజే 274 మంది అధిరోహకులు ఎవరెస్ట్ శిఖరాన్ని చేరుకుని, ఒక కొత్త రికార్డును నెలకొల్పారు. ఈ అధిరోహకులందరూ నేపాల్ వైపున ఉన్న 'సౌత్ బేస్ క్యాంప్' నుండే తమ ప్రయాణాన్ని ప్రారంభించారు.

## నార్వే భూ సాంకేతిక సంస్థతో ఎన్‌హెచ్ఏఐ అవగాహన ఒప్పందం




**వుదయం డెస్క్, మే 22ః**
జాతీయ రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని బలోపేతం చేసుకునే దిశగా, నార్వేజియన్ భూ సాంకేతిక సంస్థ (ఎన్జీఐ)తో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఇటీవల నార్వేలోని ఓస్లో నగరంలో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. భూ సాంకేతిక ఇంజినీరింగ్, ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను తగ్గించడంలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఎన్‌జీఐ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా దేశ జాతీయ రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, నిర్వహించేందుకు ఎన్‌హెచ్ఏఐ కట్టుబడి ఉందనడానికి ఈ భాగస్వామ్యం నిదర్శనం. ముఖ్యంగా భౌగోళికంగా అత్యంత సున్నితమైన, సవాళ్లతో కూడిన ప్రాంతాల్లో ఇంజినీరింగ్ సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఇది కీలక ముందడుగు.
సొరంగాల నిర్మాణం, కొండచరియల స్థిరత్వ విశ్లేషణ, కొండ వాలు పర్యవేక్షణ, సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రణాళిక, రూపకల్పన, అంచనా, పర్యవేక్షణకు సహకరించేలా అంతర్జాతీయ అత్యాధునిక నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ఈ అవగాహన ఒప్పందం లక్ష్యం. ఈ ఒప్పందం ప్రకారం ఎన్‌జీఐ సంస్థ వివిధ రకాల సంప్రదింపు సేవలను అందిస్తుంది. టన్నెల్ ప్రాజెక్టుల కోసం క్షేత్రస్థాయి పరిశీలన, మున్ముందు చేపట్టే టన్నెల్ ప్రాజెక్టుల కోసం సాధ్యసాధ్య అధ్యయన నివేదికలు. సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీ, ప్రస్తుతం నడుస్తున్న సొరంగాల నిర్మాణ భద్రత తనిఖీలు వీటిలో ఉన్నాయి. అలాగే పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించి, తగిన నివారణ చర్యలను సిఫార్సు చేయడం కోసం అత్యాధునిక కొండ వాలుల స్థిరత్వ అంచనాలను కూడా అందిస్తుంది. కొండ వాలును పర్యవేక్షించడం కోసం 'ఇన్‌సార్' డేటా విశ్లేషణ, మౌలిక సదుపాయాల భద్రతను పెంపొందించే లక్ష్యంతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థల రూపకల్పన కూడా ఈ ఉమ్మడి భాగస్వామ్యంలోని అంశాలుగా ఉన్నాయి.
సంస్థాగత సామర్థ్య నిర్మాణం, విజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి కూడా ఈ అవగాహన ఒప్పందం అత్యంత ప్రాధాన్యమిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల తగ్గింపునకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరు సంస్థల మధ్య పరస్పర సహకారం ఉంటుంది. ఉమ్మడి కార్యశాలలు, సెమినార్లు, సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు, ప్రత్యేక సాంకేతిక అంశాల ప్రచురణ ద్వారా రహదారి రంగంలో సాంకేతిక సామర్థ్యాలను పెంపొందిస్తారు.గుర్తించిన రంగాల్లో కలిసి పని చేయడానికి ఇరు సంస్థలు కృషిచేస్తాయి. అయితే, ఈ ఒప్పందం నిర్దిష్ట పరిధులకే పరిమితం కాబోదు. ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ ప్రాతిపదికగా ఉండే ఈ ఒప్పందం వల్ల.. అవసరాన్ని బట్టి ఇతర సంస్థలతో స్వతంత్రంగా భాగస్వామ్యాన్ని కుదుర్చుకునే వెసులుబాటు ఇరుపక్షాలకూ ఉంటుంది. ఈ అవగాహన ఒప్పందం అయిదేళ్ల పాటు అమలులో ఉంటుంది.ఎన్‌హెచ్ఏఐ, ఎన్జీఐ మధ్య ఈ ఒప్పందం.. సురక్షిత, సుస్థిర, ప్రపంచ స్థాయి జాతీయ రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది.
మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన వినిమయం, సుస్థిర ఇంజినీరింగ్ పద్ధతుల్లో భారత్, నార్వే మధ్య పెరుగుతున్న సహకారాన్ని కూడా ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతోపాటు దీర్ఘకాలిక సంస్థాగత సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.

## ఢిల్లీ అల్లర్ల కేసుః ఉమర్ ఖాలిద్‌కు మూడు రోజుల మధ్యంతర బెయిలు

**తల్లి శస్త్రచికిత్సకు హాజరయ్యేందుకు బెయిలు మంజూరు చేసిన ఢిల్లీ హైకోర్టు**




**న్యూఢిల్లీ, మే 22 (వుదయం)ః**
శస్త్రచికిత్స చేయించుకోనున్న తన తల్లిని పరామర్శించేందుకు వీలుగా, జూన్ 1 నుండి 3వ తేదీ వరకు మూడు రోజుల మధ్యంతర బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఉమర్ ఖాలిద్‌కు మంజూరు చేసింది. రూ. లక్ష వ్యక్తిగత పూచీకత్తుపై ఖాలిద్‌కు మధ్యంతర బెయిల్‌ను కోర్టు అనుమతించింది. బెయిల్ కాలంలో ఖాలిద్ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) పరిధిలోనే ఉండాలని, ఇంటి వద్దే గడపాలని, కేవలం ఆసుపత్రిని సందర్శించడానికి మాత్రమే వెళ్లాలని కూడా కోర్టు ఆదేశించింది.
న్యాయమూర్తులు ప్రతిభా ఎం. సింగ్, మధు జైన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను జారీ చేసింది. అప్పీలుదారు తల్లి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉన్నదనే విషయాన్ని సానుభూతితో పరిగణిస్తూ, అప్పీలుదారు తన తల్లితో గడిపేందుకు వీలుగా, మూడు రోజుల పాటు [జూన్ 1 నుండి జూన్ 3 వరకు] మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి న్యాయస్థానం మొగ్గు చూపుతోంది, అని న్యాయస్థానం పేర్కొంది.
దిగువ కోర్టు మధ్యంతర బెయిల్‌ను నిరాకరించడంతో ఖాలిద్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.
మే 19న సెషన్స్ న్యాయస్థానం తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడంతో, ఖాలిద్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన మామయ్య మరణానంతరం జరిగే 40 రోజుల కర్మకాండలకు హాజరయ్యేందుకు, అలాగే శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన తన తల్లిని చూసుకునేందుకు గాను తనకు 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన దిగువ న్యాయస్థానాన్ని కోరారు. దరఖాస్తును తిరస్కరిస్తూ, సంతాప సభకు హాజరు కావడం అంత అవసరం కాదు అని, పిటిషనర్ తల్లిని ఇతర కుటుంబ సభ్యులు చూసుకోగలరని ట్రయల్ కోర్టు పేర్కొంది.
శస్త్రచికిత్స చిన్నదని, దానికి మధ్యంతర ఉపశమనం అవసరం లేదని వాదిస్తూ ఢిల్లీ పోలీసులు బెయిల్ దరఖాస్తును తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీసుల తరపున వాదిస్తున్న ఏఎస్‌జీ ఎస్.వి. రాజు, ఖలీద్‌ను పోలీసు కస్టడీలోనే ఉంచి, బదులుగా తన తల్లిని క్లుప్తంగా కలిసేందుకు అనుమతించవచ్చని ధర్మాసనానికి సూచించారు.

ఖాలిద్‌ను ఎందుకు అరెస్టు చేశారు?
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) మాజీ విద్యార్థి నాయకుడు, కార్యకర్త అయిన ఉమర్ ఖాలిద్‌ను, సెప్టెంబర్ 13, 2020న ఢిల్లీ పోలీసులు కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద అరెస్టు చేశారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 2020లో జరిగిన నిరసనలు, ఈశాన్య ఢిల్లీలో 53 మంది మరణానికి, 700 మంది గాయపడటానికి దారితీసిన మత అల్లర్ల వెనుక జరిగిన పథకం ప్రకారం జరిగిన కుట్రలో ప్రధాన సూత్రధారిగా అతని పాత్ర ఉందనే ఆరోపణలపై ఈ అరెస్టు జరిగింది.
ఖాలిద్‌పై హత్య, రాజద్రోహం, నేరపూరిత కుట్ర వంటి వివిధ ఐపిసి సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. యుఎపిఎ సెక్షన్ 43డి(5) కింద బెయిల్ మంజూరుకు అత్యంత కఠినమైన న్యాయపరమైన నిబంధనలు ఉండటం వల్ల, సెషన్స్ కోర్టు, ఢిల్లీ హైకోర్టు, సుప్రీం కోర్టులు అతని బెయిల్ పిటిషన్లను పదేపదే తిరస్కరించాయి. దీంతో విచారణ లేకుండానే అతను ప్రస్తుతం తిహార్ జైలులో నిర్బంధంలో కొనసాగుతున్నాడు.

## బాంబు బెదిరింపు ఇమెయిల్ రాకెట్ కేసులో గ్రాఫిక్ డిజైనర్ అరెస్టు

**నిందితుడు అక్రమ బంగ్లాదేశీ వలసదారుడు**



**వుదయం డెస్క్, మే 22ః**
పాఠశాలలు, సున్నితమైన సంస్థలను లక్ష్యంగా చేసుకుని దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు ఇమెయిల్‌ల నెట్‌వర్క్‌లో సంబంధం కలిగిన ఒక వ్యక్తిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. అనామక ఇమెయిల్ వివరాలను సేకరించి, వ్యాప్తి చేయడానికి ఉపయోగించే సరిహద్దు డిజిటల్ వ్యవస్థలో అతను భాగమని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నివసిస్తున్న గ్రాఫిక్ డిజైనర్ సౌరవ్ బిస్వాస్ అలియాస్ మైఖేల్ (30)ను నిందితుడిగా గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఇతను బంగ్లాదేశ్‌కు చెందినవాడు. కొన్ని సంవత్సరాల క్రితం అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించాడు. బిస్వాస్, ఈమెయిల్ ఖాతాలను సేకరించి, విక్రయించే ఒక డిజిటల్ వ్యవస్థలో భాగంగా ఉండేవాడు. ఆ ఖాతాలను తరువాత అనామకంగా బాంబు బెదిరింపులను వ్యాప్తి చేయడానికి ఉపయోగించేవారు. అతను ఈమెయిల్ ఆధారాలను కొనడానికి, అమ్మడానికి ఫేస్‌బుక్ గ్రూపులు, ఎన్‌క్రిప్టెడ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తన కార్యకలాపాలు నిర్వహించేవాడు.అతని నుంచి మూడు సీపీయూలు, ఐదు కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ఇంటర్నెట్ రౌటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.
దర్యాప్తు అధికారులు 300కు పైగా జీమెయిల్ ఐడీల వివరాలతో పాటు పాస్‌వర్డ్‌లు, షఈ జీమెయిల్ ఖాతాలలో చాలా వరకు, బాంబు బెదిరింపు ఈమెయిళ్లను పంపడం, ఇతర చట్టవిరుద్ధమైన సైబర్ కార్యకలాపాలకు పాల్పడటంలో ప్రమేయం ఉన్న పాకిస్తాన్‌కు చెందిన ఒక గుర్తుతెలియని వ్యక్తితో తదనంతరం పంచుకున్నారు, అని ఆయన పేర్కొన్నారు.పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, అలాగే అనేక రాష్ట్రాల్లో భయాందోళనలు సృష్టించిన ఈ రాకెట్‌లో ఇదే మొదటి అరెస్టు అని తెలిపారు.
భయాందోళనలు సృష్టించడం, ప్రజాశాంతికి భంగం కలిగించడం, జాతీయ
భద్రతకు ముప్పు కలిగించడమే ఈ బెదిరింపు ఈమెయిళ్ల వెనుక ఉన్న ఉద్దేశ్యం, అని ఆయన అన్నారు. అమృత్‌సర్‌లోని సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ జరిపిన దర్యాప్తులో విస్తృతమైన డిజిటల్ ట్రాకింగ్, సాంకేతిక విశ్లేషణలు చేపట్టారని, వాటి ఫలితంగానే దర్యాప్తు అధికారులు బిస్వాస్‌ను గుర్తించారని పోలీసులు తెలిపారు.

## ఇరాన్ చర్చల్లో స్వల్ప పురోగతి ఉందన్న అమెరికా



**వుదయం డెస్క్, మే 22ః**
ఇరాన్‌తో ఒప్పందం కుదురుతుందా లేదా యుద్ధం తిరిగి ప్రారంభమవుతుందా అనే అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, ఆ దేశంతో చర్చల్లో స్వల్ప పురోగతి ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుక్రవారం తెలిపారు.
తీవ్రమైన చర్చలు జరుగుతున్నందున ఇరాన్‌పై సైనిక దాడిని వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ అంగీకరించకపోతే ఏప్రిల్ మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోవచ్చని ట్రంప్ వారాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు.
స్వీడన్‌లోని హెల్సింగ్‌బర్గ్‌లో జరగనున్న నాటో విదేశాంగ మంత్రుల సమావేశానికి ముందు రూబియో మాట్లాడారు. యుద్ధం ముగిసిన తర్వాత హార్ముజ్ జలసంధిలో శాంతిభద్రతల పరిరక్షణకు సహాయపడటంలో తమ పాత్ర ఏమిటనే దానిపై ఈ సైనిక కూటమి చర్చించనుంది.పురోగతిని అతిశయోక్తిగా చెప్పడం తనకి ఇష్టం లేదని, కొంత పురోగతి ఉంది, అది మంచిదే అని రూబియో అన్నారు. చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. అయినప్పటికీ, ఇటీవలి వారాల్లో పురోగతి సాధించినట్లు పదేపదే వాదనలు వినిపిస్తున్నా, ఒప్పందం మాత్రం కుదరలేదు.
ట్రంప్ తెహ్రాన్‌కు పదేపదే గడువులు విధించి, ఆపై వెనక్కి తగ్గారు. అయితే, చర్చలు కొనసాగేందుకు వీలుగా సైనిక చర్యను వాయిదా వేస్తానని ఆయన గతంలో సూచించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ ఆ వెంటనే మాట మార్చి, దాడులకు దిగారు. యుద్ధం ప్రారంభమైన దశలో సరిగ్గా ఇదే జరిగింది. చర్చలు సాగేందుకు అనుమతిస్తానని సూచించిన కొద్ది రోజులకే, ఫిబ్రవరి చివరిలో ఆయన దాడులకు ఆదేశాలు జారీ చేశారు.
ఇరాన్, దాని అనుబంధ మిలీషియాల ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్న ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులతో సహా, మధ్యప్రాచ్యంలోని మిత్రదేశాల అభ్యర్థన మేరకు ఈ వారం ఇరాన్‌పై జరప తలపెట్టిన దాడులను తాను విరమించుకున్నట్లు ట్రంప్ తెలిపారు.అయితే, చర్చలకు అవకాశం ఇవ్వాలన్న ట్రంప్ నిర్ణయం ఈ వారం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో ఉద్రిక్తతకు దారితీసింది.మీడియాతో మాట్లాడేందుకు తమకు అధికారం లేనందున పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అధికారి గురువారం మాట్లాడుతూ, ఇరాన్‌తో చర్చల స్థితి గురించి మంగళవారం ట్రంప్, నెతన్యాహూల మధ్య ఒక నాటకీయ ఫోన్ సంభాషణ జరిగిందని, ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై ఇజ్రాయెల్ ఆగ్రహంగా ఉందని తెలిపారు.
తాను కోరుకున్నది ఏదైనా నెతన్యాహు చేస్తారని ట్రంప్ తర్వాత విలేకరులతో అన్నారు.ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభించినప్పటి నుండి ఇద్దరు నాయకుల మధ్య సయోధ్య కుదిరినట్లు బహిరంగంగా వెలువడిన తొలి సంకేతాలలో ఈ వ్యాఖ్యలు కొన్ని.
యుద్ధ విరమణ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి, కానీ ప్రతిష్టంభనలు ఇంకా ఉన్నాయి
ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలలో భాగంగా, ఇరాన్ నాయకులను కలవడానికి పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి ఈ వారం రెండుసార్లు తెహ్రాన్‌కు వెళ్లారని శుక్రవారం పాకిస్తాన్ తెలిపింది.
రాజధానిలో జరిగిన వారాంతపు విలేకరుల సమావేశంలో, పాకిస్తాన్ రాజకీయ, సైనిక నాయకత్వం శాంతిని పెంపొందించడానికి కృషి చేస్తున్నాయని, మంత్రి చేసిన రెండు పర్యటనలు ఇందుకు నిదర్శనమని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రబి పేర్కొన్నారు.చైనా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ శనివారం నాడు నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్‌కు వెళ్తారని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో పాకిస్తాన్ శాంతి ప్రయత్నాలపై చర్చలు జరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

### వుదయం కథనానికి స్పందన

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

**అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు**

**మహాదేవపూర్ మే 22 (వుదయం ప్రతినిధి)**



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.వరి ధాన్యం తరలింపులో కాంట్రాక్టర్ తీరుతో మంత్రికి అప్రతిష్ఠ వసూళ్ల పర్వంతో రైతన్నల్లో కన్నీటి కష్టాలు అనే శీర్షికను శుక్రవారం ప్రచురితమైంది.దీంతో స్పందించిన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రైతులు ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది శుక్రవారం కాళేశ్వరం గ్రామంలోని మెగా విశ్రాంతి భవనంలో ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి తక్షణ చెల్లింపులు జరిగేలా ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రిఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి పారదర్శకంగావ్యవహరించాలని, ఆర్డీవో పర్యవేక్షణలో కొనుగోళ్లు జరగాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా అమలుచేయాలని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కాటారం ఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత

### – జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద స్వచ్ఛత కార్యక్రమం**

**హనుమకొండ, మే 22 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా శుక్రవారం ఉదయం వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో, జీడబ్ల్యూఎంసీ అధికారుల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వడ్డేపల్లి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్సిబ్బంది,పర్యాటకశాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యాటక ప్రాంతాల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రతి పౌరుడు వారంలో కనీసం ఒక రోజు "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాల్లో పాల్గొని నగరాన్ని పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.పారిశుద్ధ్య కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ బాధ్యతగా భావించకుండా ప్రజలు భాగస్వాములుగా మారాలని సూచించారు. వినియోగించిన వ్యర్థాలను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు సహకారం అందించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిడబ్లుఎంసి సిహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ అధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలి

### భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కలెక్టర్ అంకిత్

**అధికారుల – ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే ప్రజా పాలన విజయవంతం :**

**ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం ఘనంగా నిర్వహణ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 22 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించగా, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన, సంక్షేమ, అభివృద్ధి ప్రదర్శన స్టాల్‌స్‌ను పరిశీలించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభ దశలో జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు విస్తృత స్థాయిలో చేపట్టినట్లు తెలిపారు.కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే గొప్ప కార్యక్రమమన్నారు.,"పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ" ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ" తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయని అన్నారు . "కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ" ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి,మే22(వుదయం):**



పట్టణంలోని SLNC కాలేజీ గ్రౌండ్‌లో హోటల్ చాలుక్య గ్రాండ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ముదటి బుహుమతి 25000/ 2వ బహుమతి 15000/ ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న శ్రీనివాస్ శెట్టి గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడు తు క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ గారు, మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ గారు, పట్టణ కౌన్సిలర్లు,ఆర్గనైజషన్ కమిటీ సభ్యులు సురేష్ రాజు కిరణ్ నిరాజ్ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పలువురు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**జూన్ 2 నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు, కొత్త పెన్షన్ల మంజూరు**

**ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం**

**ములుగు జిల్లా స్థాయి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమావేశం ఘనంగా నిర్వహణ**

**ములుగు, మే 22 (వుదయం ప్రతినిధి) :**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. శుక్రవారం ములుగులోని లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన జరిగిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" జిల్లా స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, అంతకుముందు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

**జూన్ 2 నుండి కొత్త పథకాలు..**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జూన్ 2వ తేదీ నుండి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ములుగు జిల్లాలో కొత్తగా 38 వేల పైచిలుకు పెన్షన్లను అందించబోతున్నామని, అర్హుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కోసం ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తామని, రోజు విడిచి రోజు రాగిజావ, వేడి పాలు అందిస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని విస్తరిస్తూ, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామన్నారు.జిల్లా ప్రగతిపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.ఉపాధి కల్పన ములుగు జిల్లా నిరుద్యోగ యువత కోసం 80 నుండి 100 బహుళజాతి కంపెనీలతో త్వరలోనే 'మెగా జాబ్ మేళా' నిర్వహిస్తాం.భూముల రీ సర్వే: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రామచంద్రపూర్ శివారులోని 10 వేల ఎకరాల భూములకు రీసర్వే చేయిస్తాం.సమ్మక్కసారలమ్మ ఆలయ అభివృద్ధి: జాతర కోసం రైతుల నుండి సేకరించిన 22 ఎకరాల భూమికి నష్ట పరిహారం చెల్లించాం.మహిళా వారోత్సవాలు ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుండి జిల్లాలో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి.

పదవ తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కలెక్టర్ బోర్ఖడే హేమంత్ మాట్లాడుతూ, ప్రజా దర్బార్లలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరిస్తున్నామని, అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యటించాలని కోరారు. లబ్ధిదారులకు రూ.20 కోట్ల పైచిలుకు చెక్కుల పంపిణీ:.మహిళా సంఘాలకు స్త్రీ నిధి ద్వారా 112 సంఘాలకు రూ.2.25 కోట్లు, బ్యాంక్ లింకేజీ ద్వారా 175 సంఘాలకు రూ.16.15 కోట్లు, మెప్మా కింద 25 సంఘాలకు రూ.2.02 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు.కళ్యాణ లక్ష్మి 140 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు.ఇందిరమ్మ ఇండ్లు పెగడపెల్లి, కాసిందేవిపేట, రాయినిగూడెం గ్రామాలకు చెందిన 14 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాద్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లోడింగ్, ఆన్ లోడింగ్ వేగం పెరగాలి

**ఒపీఎంఎస్ లో అప్డేట్ ఉండాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మే 22 (వుదయం ప్రతినిధి) :**



కొనుగోలు అయిన ధాన్యన్ని త్వరగా మిల్ లకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు జనగామ మండలం శామీర్ పేట్ లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర నిర్వాహకులని కొనుగోలు ప్రక్రియ, రవాణా గురించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు ఇప్పటి వరకు కొనుగోలు అయిన ధాన్యం ఎంత సీరియల్ ప్రకారం చేస్తున్నారా లేదా లోడింగ్ అయ్యి ఎన్ని లారీ లు మిల్లకు వెళ్లాయి అని తదితర వివరా లను

అడిగి తెలుసుకున్నారు అనంతరం జిల్లా కలెక్టర్ కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు ఇస్తూ....సీరియల్ ప్రకారమే ధాన్యం మిల్ లకు వెళ్లాలని ,సరిపడా లేబర్ ని పెట్టుకొని త్వరగా లోడింగ్, ఆన్ లోడింగ్ జరగాలని, ట్యాబ్ ఎంట్రీ లో ఆలస్యం ఉండకూడదని కలెక్టర్ తెలిపారు

## ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాలు విజయవంతంగా అమలు**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందంజ**

**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, వుదయం బ్యూరో మే-22:**





ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం తోనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళా క్షేత్రంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, లక్ష్యాలను ప్రజలకు వివరించేందుకు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభ సమయంలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో

అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం, ఇందిరా మహిళా శక్తి క్రింద బ్యాంకు రుణాలు కల్పన వంటి చర్యలతో పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఖమ్మం జిల్లాలో పూర్తయ్యాయని వెల్లడించారు.ఖమ్మం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ప్రజాప్రతినిధి వేసవి కాలంలో ఎక్కువ సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## వక్ఫ్ బోర్డుకు అనుకూలంగా హైకోర్టు సంచలన తీర్పు

### అడ్వకేట్ రహీమ్‌కు ఘన సన్మానం

**యాదాద్రివనగిరి, మే22(వుదయం):**



భువనగిరి టౌన్‌లోని చెరువు కట్ట భూమి వివాదంలో తెలంగాణ హైకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించి, వక్ఫ్ బోర్డుకు అనుకూలంగా తీర్పు వచ్చేలా కృషి చేసిన ప్రముఖ న్యాయవాది (అడ్వకేట్) రహీమ్‌ను ముస్లిం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు ఖ్వాజా బషీరుద్దీన్ మాట్లాడుతూ.. భువనగిరి ఈద్గాకు అనుకూలంగా హైకోర్టు నుండి ఇంతటి పెద్ద తీర్పు రావడం ఎంతో సంతోషకరమన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భువనగిరి టౌన్ (చెరువు కట్ట) సమీపంలో ఉన్న వక్ఫ్ బోర్డు భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆయన పేర్కొన్నారు. గత ఈద్ ఉల్ ఫితర్ (రమజాన్) ప్రార్థనల నిర్వహణకు సైతం ఆటంకాలు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే, హైకోర్టులో ఇరువర్గాల న్యాయవాదుల మధ్య జరిగిన సుదీర్ఘ వాదనల్లో భువనగిరి కి చెందిన ప్రముఖ అడ్వకేట్ రహీమ్ తన అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. కోర్టు ముందు బలమైన డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పిస్తూ, సదరు భూమి పూర్తిగా వక్ఫ్ బోర్డుకు చెందినదేనని నిరూపించారు. గతంలో లోయర్ కోర్టు మరియు రెవెన్యూ కలెక్టర్ సైతం ఈ భూమి వక్ఫ్ బోర్డుదేనని ధృవీకరించిన విషయాన్ని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు వారన్నారు . అడ్వకేట్ రహీమ్ వినిపించిన బలమైన వాదనలను, కేసులోని అన్ని కోణాలను పరిశీలించిన గౌరవ హైకోర్టు.. ఆక్రమణదారు .ఈ చారిత్రాత్మక విజయంపై అడ్వకేట్ రహీమ్ మాట్లాడుతూ.. దైవానుగ్రహం, ప్రజలందరి ఉమ్మడి కృషి వల్లే నేడు కొత్త ఈద్గాలో మళ్లీ ప్రార్థనలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. గెలుపు ఎప్పుడూ సత్యానిదేనని, నేటి తీర్పు ఆ విషయాన్ని మరోసారి రుజువు చేసిందని పేర్కొన్నారు. . ఈ సన్మాన కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఇక్బాల్ చౌదరి, అజీముద్దీన్, మోయిన్, ముజీబ్, అమీన్, కాజిమ్ మరియు పాల్గొన్నారు .

## గవర్నర్ దంపతులకు ఘనంగా సత్కారం



**భూపాలపల్లి మే 22 (వుదయం విలేకరి)**

భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం, కాళేశ్వరం వద్ద నిర్వహిస్తున్న సరస్వతి నది అంత్య పుష్కరాలలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు శుక్రవారం పవిత్ర స్నానం ఆచరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, గవర్నర్ దంపతులను ఘనంగా సత్కరించారు.గవర్నర్ దంపతులు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి వేదాశీర్వచనాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.పుష్కరాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భక్తులకు కల్పించిన సౌకర్యాలను గవర్నర్ దంపతులు పరిశీలించి అభినందించారు. భక్తులకు తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్న అధికారులను కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, జిల్లా అధికారులు, ఆలయ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు, బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలి,




**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా7540 స్వయం సహాయ బృందాలకు వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా మే 22 వుదయం జిల్లా ప్రతినిధి**

శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశం ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అధ్యక్షతన నిర్వహించగా *ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్. హాజరయ్యారు, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణ... ఆలపించి, ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు..సభా ప్రాంగణం లో రెండు పడకల గదుల నిర్మాణం, ఆయిల్ పామ్, వ్యవసాయ, పరిశ్రమలు వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ రెడ్ క్రాస్, చేనేత వస్త్రాల, తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ను ఏర్పాటు చేశారు,..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేరువగా పాలన అందించడానికి క్షేత్రస్థాయిలో జవాబుదారితనం పారదర్శకత తో కూడిన మెరుగైన పాలనను ప్రజా అభిప్రాయానికి ప్రత్యేకించి నిరుపేద అణగారిన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు సామాజిక న్యాయ ఆర్థిక సాధికారిక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సేవలు అందించడం జరుగుతుందన్నారు,ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక దరఖాస్తులు డిజిటలైజ్ చేసి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో రాష్ట్రంలో జిల్లా ఆరవ స్థానంలో ఉందని, మిగిలిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు, బాల్య వివాహాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని జిల్లా స్పెషల్ టీం నిరంతరం నిఘా పెట్టడం జరిగిందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని, తద్వారా కుటుంబ పోషణ బాధ్యతలు చూసుకోవడం జరుగుతుందని అన్నారు అందుకే ఆడపిల్లలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాలని తెలిపారు,

జిల్లాలో నిరుద్యోగం పెరిగిపోయిందని ప్రతి ఒక్కరికి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే జిల్లాలో సుమారు 6వేల మంది నిరుద్యోగులు తమ దరఖాస్తులను ఉపాధి కల్పన అధికారి దగ్గర నమోదు చేసుకున్నట్లు తెలిపారు, పదవ తరగతి పూర్తి అయిన వెంటనే వృత్తి విద్యా శిక్షణ తరగతులలో చేరి ఉపాధి పొందాలని తెలిపారు,

డిఆర్డిఏ ఆధ్వర్యంలోని 562 కోట్ల 11 లక్షలు 6వేల931 మంది, మెప్మా 97 కోట్లు 33 లక్షల 48వేలు 609 సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగింది.

ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు మత్తు పదార్థాలను నివారణ, బాల్యవివాహాల నిర్మూలించుటకు అవగాహన కార్యక్రమాలు, మే 4 నుండి 9 వరకు రైతు సంక్షేమ వారోత్సవాలు మే 11 నుండి 16 వరకు విద్య వారోత్సవాలు, ఘనంగా నిర్వహించడం జరిగిందని, మే 18 నుండి 23 వరకు యువత క్రీడోత్సవం కొనసాగుతుందని, మే 25 నుండి 30 వరకు మహిళలందరికీ స్వయం సహాయక బృందాల సభ్యులకు పొదుపు చర్యలు తదితర అంశాలపై అవగాహన, జూన్ 1 నుండి 12 వరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో తీసుకోవలసిన చర్యలు తీసుకుంటున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, (ఇన్చార్జి) అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పిడి హౌసింగ్ జెడ్పి సీఈవో పురుషోత్తం,మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఎస్పీ తిరుపతిరావు, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లాలోని అందరూ ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు

## సమతుల్యత ఎరువుల వినియోగం పై అవగాహన సదస్సు




**చర్ల మే 22 వుదయం ప్రతినిధి**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం రైతు వేదిక లో శుక్రవారం జరిగిన కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం శాఖ వారి ఆధ్వర్యంలో "రైతు ముంగిట శాస్త్రవేత్తలు" అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమంలో సుమారుగా 90 మంది రైతులు పాల్గొన్నారు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విడుదల చేసిన వరి రకాలను సాగుచెయ్యాలని. అధికంగా ఎరువుల వాడకం వల్ల భూమి సారం తగ్గుతుందని, పురుగుమందులు వాడకం తగ్గింది వేప నూనె, జిగురు అట్టలు, ప్రకృతి వ్యవసాయం చెయ్యాలని సూచించారు. పెరటి కూరలు సాగుచెయ్యడం వల్ల ఆదాయం సంపాదించుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగు చెయ్యడం వల్ల సుస్థిర ఆదాయం వస్తుంది అని నేల ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ, లావణ్య, అఫిది, వినీల, నవీన్, నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సిద్దిపేట జిల్లాలో బాలల వసతి గృహం, జిల్లా కారాగారాల తనిఖీ




**సిద్దిపేట, మే 21 (వుదయం బ్యూరో ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలైన శ్రీమతి కె. సాయి రమాదేవి గారి మార్గదర్శకత్వంలో గురువారం ఉదయం సిద్దిపేటలోని బాలల వసతి గృహాన్ని (బాలసదనం) అధికారులు సందర్శించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిద్దిపేట ఒకటవ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి శ్రీ వై. జయ ప్రసాద్, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి మరియు సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పూర్తి అదనపు బాధ్యతల కార్యదర్శి శ్రీ ఎన్. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పిల్లలతో ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, చదువు విలువను గుర్తించాలని పిల్లలకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే సిద్దిపేటలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వారు శిశు గృహాన్ని సందర్శించి గదులను, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అని హాజరు పట్టికను తనిఖీ చేశారు. బాలసదనంలో వంటగది పరిసరాలు, భోజన నాణ్యత, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా గురువారం ఉదయం సిద్దిపేట జిల్లా కారాగారాన్ని (జైలును) న్యాయమూర్తులు శ్రీ వై. జయ ప్రసాద్, శ్రీ ఎన్. సంతోష్ కుమార్ సందర్శించారు. వీరికి జిల్లా కారాగార పర్యవేక్షకులు (సూపరింటెండెంట్) శ్రీ జి. రత్నం, ఉప పర్యవేక్షకులు శ్రీ వికాస్ మరియు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. న్యాయమూర్తులు కారాగారంలోని వంటగది, సరుకుల గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజన వసతుల గురించి కారాగార పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి, వారంతా సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రతి ఒక్కరికీ న్యాయవాదుల సహాయం ఉండాలని స్పష్టం చేశారు. న్యాయ సహాయ రక్షణ మండలి (లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్) ప్రతి వారం కారాగారాన్ని సందర్శిస్తుందని, న్యాయవాదులు లేని వారికి ఈ మండలి ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య న్యాయ సహాయ రక్షణ మండలి సభ్యులు శ్రీ చి. శరత్ బాబు, సహాయ న్యాయ సహాయ రక్షణ మండలి సభ్యులు శ్రీ ఎమ్. రవి కుమార్, సిద్దిపేట కారాగార సిబ్బంది మరియు న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు, కారాగారాల్లో మౌలిక వసతుల పరిశీలనతో పాటు, నిరుపేదలకు, ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే ధ్యేయంగా ఈ తనిఖీ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలు

**ప్రగతి ప్రణాళికల రూపకల్పనకే 99 రోజుల కార్యక్రమం**
**అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఎస్పి శ్రీనివాసరావు**


**గద్వాల మే 22 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం దోహదపడుతుందని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా ఇప్పటివరకు పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల గురించి శుక్రవారం గద్వాలలోని బృందావన్ గార్డెన్ లో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతాన్ని ఆలపించిన అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుమోహన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతి నిధులు క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే కాక ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేసిన, త్వరలో అమలు చేయబోయే వివిధ సంక్షేమ పథకాల, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఒక ప్రణాళికతో ముందుకెళ్తే మంచి ఫలితాలు వస్తాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 99 రోజులపాటు వివిధ శాఖల కార్యక్రమాలపై వారోత్సవాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఆయా శాఖల్లో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, పరిశుభ్రత పనులు కూడా నిర్వహించినట్లు తెలిపారు. అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా పేర్కొంటూ 99 రోజుల షెడ్యూల్ అనంతరం కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని కొనసాగించడం జరుగుతుందని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దాదాపు మూడు నెలలకు పైగా సుదీర్ఘంగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలోనూ అరైవ్, అలైవ్ వారోత్సవాల్లో ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించామన్నారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది మరణించడమే కాక క్షతగాత్రులుగా మారుతున్నారని వాహనదారులు సురక్షిత ప్రయాణం చేసి క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే లక్ష్యంతో అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగిందన్నారు. యువత డ్రగ్స్ కు బానిసలు కారదనే ఉద్దేశంతో ప్రభుత్వం యువతకు అవగాహన కల్పించడమే కాక డ్రగ్స్ సమాచారం అందించే వారికి ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. విద్య, వైద్యం, తదితర శాఖల కార్యక్రమాలను కూడా విజయవంతంగా నిర్వహించారన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు ఈ కార్యక్రమం సువర్ణావకాశంగా పేర్కొంటూ, ప్రభుత్వ పథకాలపై, కార్యక్రమాలపై వారికి కూడా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 10 అంశాలను ప్రధానంగా తీసుకొని 99 రోజులపాటు పలు శాఖలకు సంబంధించి వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతో



ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గృహ జ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలతో పాటు త్వరలో ఓనూతనంగా అమలు చేయబోయే ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహారం, జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనం వంటి పథకాల గురించి తెలియజేయడం జరిగిందన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాక సన్న రకం వరికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లా చారిత్రాత్మక, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించడంలోనూ సర్పంచులు కీలకపాత్ర పోషించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కోరారు. అనంతరం వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పీపీటీ ద్వారా ప్రదర్శించారు. అంతకు ముందు బాల భవన్ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివిధ గీతాలను ఆలపించారు. అనంతరం పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ముఖ్య అతిథులు సందర్శించి తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మునిసిపల్ చైర్పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు




**సంగారెడ్డి వుదయం.**

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ గారి 138వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్‌డబ్ల్యూఓ డీడీ అకిలేష్ రెడ్డి, డివిఎంసి సభ్యులు పంబల్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వారు భాగ్యరెడ్డి వర్మ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ గారు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య, సామాజిక చైతన్యం, సమాన హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మరికల్ ఎస్సై గా విక్రమ్ బాధ్యతలు స్వీకరణ




**మరికల్ మే 22 (వు దయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలోని నూతన ఎస్సై విక్రం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు మహబూబ్నగర్ జిల్లా నవాబుపేట్ మండలం నుంచి మరికల్ కు బదిలై వచ్చినారు మరికెల్ ఎస్సైగా పనిచేస్తున్న రాము నాగర్ కర్నూల్ తాడూరు ఎస్సై బదిలీపై వెళ్లారు మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణకై కృషి చేస్తానని నూతన ఎస్సై విక్రం తెలిపారు ఎస్సై రాము నుండి నూతన విక్రమ్ బాధ్యతలు తీసుకున్నారు

## అర్జీలను సత్వరం పరిష్కరించడమే నిజమైన ప్రజాపాలన

**వనపర్తి మే 22 (వుదయం ప్రతినిధి)**

అధికారులు బాధ్యతాయుతంగా ప్రజల అర్జీలని సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలి, అదే ప్రజాపాలనకు నిజమైన అర్థం : రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తాం : వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉన్నారు. కార్యక్రమానికి ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత




ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు విద్యా వైద్యంపై ప్రధాన దృష్టి సారించి, వీటికి ప్రధానంగా నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రజల అర్జీలను, దరఖాస్తులను వేగంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం వద్దని, వాటిని వేగంగా పరిష్కరించాలని తెలిపారు. ఎటువంటి సమస్య వనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

వనపర్తి లో 70 కోట్ల రూపాయలతో అందరికీ మంచినీటి సౌకర్యం అందించేందుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. 47 కోట్ల రూపాయలతో వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మరియు జూనియర్ కళాశాలల భవన నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సరికొత్త వనపర్తి జిల్లా హాస్పిటల్ నిర్మాణం కొరకు 203 కోట్ల రూపాయలతో పనులు శరవేగంగా ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. అదేవిధంగా యూనియన్ చేయడం జరిగిందని తెలిపారు.అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఎల్పిజి కనెక్షన్ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమం కింద జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో 16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వనపర్తి, చిన్నంబావి మండలాలకు చెందిన మహిళా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి కింద బస్సులను అందజేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయం చైర్మన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపాలిటీ చైర్పర్సన్ మాధవి, పెబ్బేరు మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మునిసిపల్ చైర్పర్సన్ అరుణ, ఆత్మకూరు మునిసిపల్ చైర్పర్సన్ నాగమణి, అమరచింత మునిసిపల్ చైర్పర్సన్ సువర్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నత్త నడకగా హైదరాబాద్ బీజాపూర్ హైవే విస్తరణ పనులు...!

**వికారాబాద్ మే 22 (వుదయం బ్యూరో)**



హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి (NH163) విస్తరణ పనులు నత్త నడకగా కొనసాగుతున్నాయి. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు కొనసాగుతున్న విస్తరణ పనులు మందకొడిగా నడుస్తున్నాయి.18 చోట్ల అండర్ పాసులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎనిమిది చోట్ల కూడా పనులు పూర్తి కాలేదు. గత ఏడాది ఆగస్టులో మొదలైన పనులు మొదట చురుకుగా కొనసాగాయి. ఈ ఏడాది మొదట్లో వేగంగా పనులు చేపట్టిన గత రెండు నెలల నుంచి మందకొడికే కొనసాగుతున్నాయి. కండ్లపల్లి, తోలుకట్ట, ముడిమాల ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న అండర్ పాస్ పనులు నర్తనడకగా నడుస్తున్నాయి. రెండు మూడు చోట్ల నిర్మాణం పూర్తయిన పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టడం లేదు. ఇప్పటికే సగభాగం నిర్మాణ పనులు పూర్తి అవుతాయని రెండో భాగం కూడా మొదలు పెడతారని మొదట ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఈ పనులు నత్తనక్కగా కొనసాగుతుంటే ఎలాంటి చర్య తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ రహదారికి నెత్తుటి రహదారి కొంతమంది పిలుస్తుంటారు ఎందుకంటే 200 మందికిపైగా ఈ రహదారిపై మృతి చెందారు. ఎట్టకేలకు విస్తరణ పనులు మొదలయ్యాయని ప్రజలు సంతోషపడ్డారు కానీ నేడు నతనక కొనసాగడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ హైవేపై అనేక ప్రమాదాలు 2018 నుంచి చోటు చేసుకున్న ప్రమాదాల్లో 200 మందికిపైగా మరణించగా..

సుమారు 600 మంది గాయాలపాలయ్యారు. అన్ని అడ్డంకులు తొలిగి రోడ్డు విస్తరణ పనులకు మోక్షం కలగడంతో పనులు ప్రారంభం అయ్యాయి. ఏడు సంవత్సరాల అనిశ్చితి తర్వాత, హైదరాబాద్‌విజయపుర (బీజాపూర్) హైవే (NH 163) పై రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2018లో విధించిన స్టే ఉత్తర్వులను అక్టోబర్ 31న జాతీయ హరిత ట్రిబ్యునల్ (NGT) ఎత్తివేసింది. యాదృచ్చికంగా, చేవెళ్ల సమీపంలో లారీబస్సు ఢీకొన్న ఘటనలో 19 మంది మరణించిన రోజున ఈ ఉత్తర్వు వెలువబడే TSPA (గతంలో APPA) జంక్షన్, మన్నెగూడ వయా మొయినాబాద్, చేవెళ్ల మధ్య 46 కి.మీ.ల మార్గాన్ని రూ.956 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించనున్నారు. పూర్తి చేయడానికి ప్రభుత్వం రెండేళ్ల గడువును నిర్ణయించింది. ఈ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలను ఈ రహదారి కలుపుతోంది. కొడంగల్, పరిగి, పూడూరు, చేవెళ్ల, మొయినాబాద్ మీదుగా ఈ రహదారి సాగుతోంది. హైదరాబాద్ నగరం నుంచి కర్ణాటక గుల్బర్గా, బీజాపూర్‌తో పాటు వికారాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఈ మార్గమే ప్రధానమైనది. అయితే ఈ రహదారిపై రద్దీ ఎక్కువగా ఉండటం, నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో నేషనల్ హైవే అధారిటీ అధికారులు విస్తరణకు మొగ్గు చూపారు. 2018లో 163వ జాతీయ రహదారిగా గుర్తించి భూసేకరణ చేపట్టారు. అప్పట్లోనే హైదరాబాద్ అప్పా జంక్షన్ నుంచి పూడూరు మండలం మన్నెగూడ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి

## పరిశుభ్ర గ్రామ నిర్మాణానికి ప్రత్యేక డస్ట్‌బిన్‌ల ఏర్పాటు



**దౌల్తాబాద్, మే 22 (వుదయం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో గ్రామ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) కోసం ప్రత్యేక డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్, ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో చెత్తను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి పరిశుభ్ర వాతావరణం కల్పించేందుకు ఈ డస్ట్‌బిన్‌లు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత డస్ట్‌బిన్‌లలోనే వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్జాలుద్దీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పాలకవర్గ సభ్యులు, పాపాగౌని ప్రవీణ్, కేంసారం నాగరాజు, నాయకులు ముక్కెర నర్సింలు, కర్రోల్ల మల్లేశం, జీర్కపల్లి నరేశ్, ఇతర ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి గ్రామస్తుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన సమాజానికి నాంది అని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం..



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం కార్మికులకు వేతనాలు పెంపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అమరాసేనారెడ్డి ,లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మే 2 తారీకున ఒక కోటి 11 లక్షల కార్మికులకు వేతనాలు పెంచడం జరిగిందని.కార్మిక కర్షకులకు రైతులకు ఆదర్శ ప్రాయుడిగా నిలిచిన రేవంత్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పై ధరలు పెంచుతూ ప్రజల పై అధిక భారం మోపుతూ రైతులను నడ్డి విరిచేలా అవలంబిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, నసీరుద్దీన్, పట్టణ అధ్యక్షులు కొమ్మట బాబు, సర్పంచులు బొమ్మన మల్లేశం, రామచందర్ నాయక్, ఉప సర్పంచ్లు ఆకుల మహేందర్, రమేష్, సీనియర్ నాయకులు లక్ష్మా గౌడ్,రమేష్, మధు,కనక రాజు, నాగరాజు, డైరెక్టర్ రాజిరెడ్డి, భూమా గౌడ్, బాగులు గౌడ్, ఋషికేష్ అబ్బా రెడ్డి, శ్రీశైలం, సిద్ధ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అసమర్థ విధానాలతో యువత భవిష్యత్తు నాశనం




**నీట్, యూజీసీ పేపర్ లీకేజీలకు కేంద్రానిదే బాధ్యత**
**సీపీఎం నేత తీగల సాగర్**
**పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలి**

**నాగర్ కర్నూల్, మే 22 (వుదయం ప్రతినిధి)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల నీట్, యూజీసీ ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో దేశంలో యువత జీవితాలు నాశనమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తీగల సాగర్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెట్టి కోచింగ్ ఇప్పించి భారం ఒకవైపు ధరల పెరుగుదలతో సామాన్యుడు ఇబ్బంది పడుతుంటే, మోడీ విలాసవంతమైన జీవితం గడుపుతూ విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. పొదుపు చర్యలు పాటించమని దేశానికి సూచించిన మోడీయే పొదుపును గాలికొదిలేశారన్నారు.యుద్ధం సాకుతో పెట్రోల్, గ్యాస్ ధరలు పెంపు యుద్ధం పేరుతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, సీఎన్‌జీ ధరలను విపరీతంగా పెంచారని సాగర్ మండిపడ్డారు. బంగారంపై దిగుమతి సుంకం పెంచడంతో సామాన్యులు బంగారం కొనలేని స్థితికి వచ్చారని తెలిపారు. మోడీ విధానాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.నిందితులను శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలి కేంద్ర ప్రభుత్వం అసమర్థ విధానాలు విడనాడాలని, అధికారం ఎప్పుడూ ఒకరికే శాశ్వతం కాదని మోడీ గుర్తుంచుకోవాలని సాగర్ హెచ్చరించారు. నీట్, యూజీసీ ప్రశ్నపత్రం లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని, పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్ధన్, పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, కందికొండ గీత, ఎం.ఆంజనేయులు, దేశ్య నాయక్, సి.ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు మల్లయ్య, పోదిల రామయ్య, బాలస్వామి, అంతటి కాశన్న, తారా సింగ్, హనుమంతు, సైదులు, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నిరుపేదకు ప్రభుత్వ ఫలాలు అందాలి

**దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**

**మహబూబ్ నగర్ మే 22 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజల వద్దకే పాలన అనే లక్ష్యంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ద్వారా ఒక మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన వారికి పారదర్శకంగా ఫలాలు అందిస్తున్నారని చెప్పారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసం పెరిగిందని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు సుమారు రూ.1,136 ఆదా అవుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం



ద్వారా మహిళలకు ఉచిత బస్సు గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాల వివరాలను ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.అధికారులు ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏమిటి, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అర్హతలు ఏమిటి అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, విద్యాశాఖ, వ్యవసాయశాఖ తదితర శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజలందరూ సహకరించాల ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల్‌కోటి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్వో రామ్‌రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్టాళ్ల ప్రదర్శన.....సమావేశానికి ముందు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాళ్లను సందర్శించి ప్రారంభించారు. ఈ స్టాళ్ల ద్వారా ఆయా శాఖలు అమలుపరుస్తున్న వివిధ పథకాలు గురించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సబ్సిడీ పరికరాల గురించి ప్రదర్శించారు. అలాగే గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులుతయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు.

# చక్కని ఆరోగ్యం

## నూనె వాడకంలో జాగ్రత్తగా..!



సాధారణంగా అందరూ ఆరోగ్యకరమైన ఆహారం గురించే మాట్లాడతారు. కానీ, ఆరోగ్యకరంగా ఆహారం వండడం గురించి ఎక్కువగా మాట్లాడరు. ఈ క్రమంలో హెల్దీ కుకింగ్‌లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది నూనె వాడకం. సాధారణంగా మన వంటల్లో నూనె కొంచెం ఎక్కువగానే ఉంటుంది. మనకు తెలియకుండానే తీసుకునే ఈ ఆయిల్ వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. ఈ క్రమంలో ఆయిల్ వాడకానికి సంబంధించి కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు అంటున్నారు నిపుణులు. నూనె లేని వంటలు ఆరోగ్యానికి మంచివని తెలిసినా... వంటకానికి మంచి రుచి కావాలంటే గిన్నెలో ఆయిల్ పడాల్సిందే. అయితే నూనెను ఎలా పడితే అలా నీళ్లలా వాడితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నూనె వాడకంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రుచికరమైన ఆహారంతో పాటు ఆరోగ్యమూ సొంతమవుతుందంటున్నారు. వేపుళ్ల బదులు బేకింగ్, స్టీమింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి. దీంతో ఆయా విటమిన్లు శరీరానికి పుష్కలంగా అందుతాయి. ఫ్రైడ్ స్నాక్స్‌కి బదులు స్టీమ్ చేసిన స్నాక్స్‌ను తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. నూనెలు కాస్త తక్కువగా వాడేవారు... వంటలో పొరపాటున కాస్త ఎక్కువైతే తినడానికి ఇబ్బంది పడతారు. ఇలాంటప్పుడు నూనెను కొలత ప్రకారం వాడుకోవడమే పరిష్కారం. ఇందులో భాగంగా డైరెక్ట్‌గా బాటిల్‌లో నుంచి నూనెను పోసే బదులు మెజరింగ్ స్పూన్ లాంటి వాటితో వేయాలి. అప్పుడు ఎంత నూనె వాడుతున్నారో తెలుస్తుంది. ఎప్పుడూ ఒకే నూనెను కాకుండా కాంబినేషన్ ఆయిల్స్‌ను వాడితే మంచిది. సన్‌ఫ్లవర్, రైస్ బ్రాన్, నువ్వులు, వేరుశెనగ వంటి నూనెల్లో ఉండే మోనోశ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్, పాలీ అన్‌శ్యాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ మన బాడీకి చాలా అవసరం. మన శరీరం వాటిని స్వయంగా తయారుచేసుకోలేదు. వంట నూనె ద్వారానే అవి శరీరానికి అందుతాయి. అందుకే వేర్వేరు నూనెల్ని కలిపి వాడుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. నూనె వినియోగానికి సంబంధించి నెలకు ఎంత వాడుతున్నామో ఒక లెక్క వేసి చూసుకోవాలి. అప్పుడు ఒక అవగాహన వస్తుంది. దీన్ని బట్టి అవసరం అనుకుంటే నూనె వాడకాన్ని తగ్గించవచ్చు. వేపుళ్లకి వాడిన నూనెని మళ్లీ వేయించడానికి ఉపయోగించకూడదు. ఇందువల్ల శరీరంలోకి టాక్సిన్స్ చేరే ప్రమాదం ఉంది. వంట నూనెను ఎక్కువసేపు వేడి చేస్తే అందులో ఉండే విటమిన్లు శరీరానికి అందే అవకాశం తక్కువ. అంతేకాదు... ఒకసారి వాడిన నూనెను ఎక్కువసార్లు వాడకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇప్పటికే వాడిన నూనెతో తాజా నూనెను కలపకూడదు. నూనెను వేడి చేసినప్పుడు దాని టెంపరేచర్ కూడా మారుతుంది. ఏ టెంపరేచర్ వద్ద నూనె పొగ రావడం మొదలు పెడుతుందో దానిని 'స్మోకింగ్ పాయింట్' అంటారు. దీనిపై కొంచెమైనా అవగాహన కలిగి ఉండాలి. ప్రత్యేకించి ఫ్రై చేయాల్సిన అవసరం వస్తే ఎక్కువ స్మోకింగ్ పాయింట్ ఉన్న నూనెను మాత్రమే వాడాలి. వంట నూనెపై సూర్యరశ్మి పడకుండా చూడాలి. నేరుగా ఎండ పడడం వల్ల నూనెలో కొన్ని రసాయనిక మార్పులు జరిగే అవకాశం ఉంది. వంట నూనె కొనే ముందు అందులో ఉన్న కొవ్వు శాతం చూసి మరీ కొనాలి. నిర్ణీత మోతాదు కన్నా ఎక్కువ ఉంటే ఆరోగ్యానికి ప్రమాదకరం అంటున్నారు నిపుణులు.

## వహ్వారే వేసవి పానీయం



వేసవిలో కొబ్బరినీళ్లు తాగుతాం, తాటిముంజలు తింటాం. అలా విడివిడిగా తిని, తాగడం కాకుండా.. ఈ రెండింటినీ కలిపి రుచికరమైన పానీయం చేయొచ్చు. ఒకసారి ప్రయత్నించి చూడండి.. కావలసినవి: తాటిముంజలు – 6, చిక్కటి కొబ్బరిపాలు – 2 గ్లాసులు, తేనె – 2 స్పూన్లు, యాలకుల పొడి – చిటికెడు, కొబ్బరి తురుము – ఒకటిన్నర స్పూన్లు, ఐస్ ముక్కలు – నాలుగు, తయారీ: తాటిముంజల పైన ఉన్న పొట్టును పూర్తిగా తీసేసి ముక్కలుగా కోసుకోవాలి. వాటిని జార్‌లో వేసి.. కొబ్బరిపాలు, తేనె, యాలకుల పొడి జోడించి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. అంతే.. తాటిముంజల కొబ్బరి పానీయం తయారైపోతుంది. అందులో కొబ్బరి తురుము, ఐస్ ముక్కలు జత చేస్తే.. చల్లచల్లగా ఆస్వాదించవచ్చు. ఇది రుచిగానూ ఉంటుంది, బలం కూడా. సమయానికి తేనె లేకుంటే బెల్లం వేసుకోవచ్చు.

## అడవి ద్రాక్షతో ఇన్ని ప్రయోజనలా..!

వాడుక భాషలో అడవి ద్రాక్షకు వేర్వేరు భాషల్లో వేర్వేరు పేర్లున్నాయి: అస్సామీలో గోవాలియా లత, పానిలత అని, ఇంగ్లీష్‌లో వైల్డ్ గ్రేప్, జంగల్ అంగూర్, దిబ్రోలి అని, ఒరియాలో పనికచో, పానినోహ, దిబ్రోయి, కంజినోయి, పానిపరు అని, కన్నడలో చితహంబు, కదుద్రాక్ష, కట్టుకోడి మింద్రి అని, గుజరాతీలో జంగ్లీ ద్రక్ అని, తెలుగులో అడవి ద్రాక్ష, అడవి తీగ ద్రాక్ష, బెడసతివ్వ, దొబ–తీగ, పుల్ల తీగ, బెంగాలీ లో గొవాలియా–లత అని, మరాఠీలో ఒకేల, నడెన, రాన్ ద్రాక్ష గోలింద్ అని, మలయాళంలో వియ–పిర–పిటిచ, కరంట వల్లీ, చంద్రవల్లీ అని, హిందీలో గొలిండ, కట్టిబేల్, పనిబేల్ అని, సంస్కృతంలో అమ్ల వెటసహా, వన ద్రాక్ష అని అంటారు. నేపాలీలో పురేని అంటారు. దీనికి 1824లో 'విటిస్ లాటిఫోలియా' అనే శాస్త్రీయ పేరు పెట్టిన 60 ఏళ్ల తర్వాత 'అంపెలోస్పిస్ లటిఫోలియా'గా పేరు మార్చారు. వీటి పండ్లు ద్రాక్ష గుత్తుల మాదిరిగా ఉంటాయి. పండిన తర్వాత ఎరుపు నలుపు రంగుకు మారుతాయి. ద్రాక్ష మాదిరిగానే దీనికి కూడా పాకుడు గుణం ఉంది. వీటికి వేరు గడ్డలు ఉంటాయి. గడ్డలు నాటుకోవచ్చు లేదా విత్తనం కూడా వేసుకోవచ్చు. ఎంతో విలువైన తీగ చెట్టు. ఈ పండ్లలో 2–4 గింజలు ఉంటాయి. ఈ తీగ చెట్టు స్వస్థలం భారత ఉపఖండం, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక మాల్దీవులు మొదలగు దేశాలలో గుర్తించారు. మన దేశంలో ఎక్కువగా అస్సాం, ఈస్ట్ హిమాలయాల వరుస, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలగు రాష్ట్రాల్లో అడవి ద్రాక్ష కనిపిస్తుంది. అధిక వర్షపాతం ఉన్న అడవుల్లో ఎక్కువగా ఉంటుంది. నల్లమల అడవుల్లో ఒకప్పటి సాంద్రత ప్రస్తుతం లేదు. దీనిపై ఉన్నత స్థాయి పరిశోధనలు జరిగినప్పటికీ దీని ప్రయోజనాలు ప్రజల చెంతకు చేరలేదు. అడవి ద్రాక్ష పండ్లు తినదగినవే. ఇవి సాధారణ ద్రాక్ష గుత్తుల్లాగే మొదట ఆకుపచ్చగా ఉండి ఎరుపునకు మారి ఆ తరువాత నలుపు రంగుకు మారతాయి. వగరు తీపితో కూడుకొని ఉంటాయి. ఎన్నో పోషక విలువలు ఉన్నందున వీటిని తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వీటి నుంచి ఎర్రరంగును తయారు చేస్తారు. ఈ రంగుకు మార్కెట్‌లో గిరాకీ ఉంది. ఈ గింజల నుంచి పలుకులను వేరు చేసి తింటారు. ఈ పలుకులు మొర్లి పలుకులను పోలి ఉంటాయి. అనేక రోగాలను తగ్గించటానికి నాటు వైద్యంలో వీటిని ఉపయోగిస్తారు. ముఖ్యంగా విరేచనాలు, బొల్లి, పంటి సమస్యలు, కడుపు నొప్పి, గౌట్, టీబీ అజీర్తి, శరీరపు వీక్ నెస్ తదితర సమస్యల నుంచి ఉపశమనం కోసం వాడుతారు. ఎముకల పటిష్టతకు ఉపయోగిస్తారు. ఆయుర్వేద, హోమియో మందుల తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఈ తీగ చెట్ల వినియోగం తప్ప భద్రపరచడం తక్కువ కాబట్టి రానున్న రోజుల్లో ఈ జాతి అంతరించే ప్రమాదం ఉంది.



## మామిడి పండ్లు తినేముందు..!

మామిడి పండ్లను చూస్తే క్షణమైనా ఆగలేం.. వాటి రుచిని ఆస్వాదించే దాకా ఉండలేం. అయితే ఆ ఆతృతే వద్దంటున్నారు నిపుణులు. ఈ పండ్లను తినే ముందు కాసేపు నీళ్లలో నానబెట్టడం మంచిదంటున్నారు. 'ఎ', 'సి', 'ఇ', 'కె', 'బి6' విటమిన్లతో పాటు ఫోలేట్.. వంటి పోషకాలు మిళితమై ఉన్న మామిడి పండ్లు రుచిలోనే కాదు.. ఆరోగ్యాన్ని అందించడంలోనూ మిన్నే! ముఖ్యంగా చర్మం, జుట్టు సంరక్షణ విషయాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ప్రయోజనాలన్నీ చేకూరాలంటే తినే ముందు వాటిని 1–2 గంటల పాటు నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు. ఒకవేళ వెంటనే తినాలనుకునే వారు కనీసం పావుగంట సేపైనా నీటిలో నానబెట్టి తినే ముందు బాగా కడగాలని సూచిస్తున్నారు. వేసవిలో తప్ప ఇతర సీజన్లలో దొరకవని కొంతమంది అమితంగా వీటిని లాగించేస్తుంటారు.



దీనివల్ల కొంత మంది శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తవుతుంది. అయితే తినే ముందు మామిడి పండ్లను నీళ్లలో నానబెడితే.. తద్వారా పండ్ల నుంచి శరీరంలో వేడి ఉత్పత్తి చేసే గుణాలు తొలగిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. మామిడి పండ్లు త్వరగా పండడానికి వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. ఇలా వాడిన రసాయనాల ప్రభావం పండు తొక్క పైన ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో– వాటిని ఆదరాబాదరాగా శుభ్రం చేసుకొని తీసుకుంటే.. ఆరోగ్యానికి ప్రమాదం! కాబట్టి, తినే ముందు మామిడి పండ్లను నీటిలో నానబెట్టడం మంచిదంటున్నారు నిపుణులు.

## మెరిపించే 'గుమ్మడి'!



సాధారణంగా గుమ్మడి కాయల్ని వంటల్లోనే ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. కానీ ఇది అందానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. ముఖానికి మెరుపును అందించడం దగ్గర్నుంచి.. సహజసిద్ధమైన మాయిశ్చరైజర్‌లా పనిచేసే గుమ్మడితో తయారుచేసుకునే కొన్ని ఫేస్‌ప్యాక్స్ గురించి తెలుసుకుందాం..

గుమ్మడి పేస్ట్‌కు కొద్దిగా పెరుగు, కొన్ని చుక్కల నిమ్మరసం, కాస్త తేనె కలిపి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని 15 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత చల్లని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల తక్షణ మెరుపును సొంతం చేసుకోవచ్చట. మెత్తగా చేసిన గుమ్మడికి చెంచా ఓట్స్, కాస్త తేనె కలిపి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీంతో ముఖమంతా మృదువుగా మర్దన చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇది చర్మానికి మంచి స్క్రబ్‌లా పనిచేసి ముఖాన్ని ప్రకాశవంతంగా మారుస్తుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ ఫేస్‌ప్యాక్స్ సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## మునగాకుపొడి చేద్దామా!

ఇడ్లీ దోశల కోసం చట్నీ చేయడం అన్నిసార్లూ కుదరకపోవచ్చు. అలాంటప్పుడు మునగాకుపొడి ప్రత్యామ్నాయం. దాన్ని ఎంచక్కా ఇంటోన్లే చేసుకోవచ్చు. ఈ పొడి చాన్నాళ్లు నిల్వ



ఉంటుంది. కాస్త నెయ్యి లేదా నూనె వేసుకుంటే.. అన్నంలోకి కూడా చాలా బాగుంటుంది. కావలసినవి: శనగపప్పు – ఒక కప్పు, మినప్పప్పు – అర కప్పు, తాజా మునగాకు – 2 కప్పులు, ఎండుమిర్చి – పన్నెండు, వెల్లుల్లి రెబ్బలు – ఆరు, నువ్వులు – రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర – స్పూన్, కరివేపాకు – గుప్పెడు, ఇంగువ – పావు స్పూన్, ఉప్పు – రుచికి తగినంత, నూనె – ఒకటిన్నర స్పూన్లు తయారీ: మునగాకును కడిగి వస్త్రం మీద ఆరబోయాలి. తడి పీల్చేసుకున్నాక.. సన్న సెగ మీద వేయించి.. క్రిస్పీగా అయ్యాక దించేయాలి. తాజా మునగాకు రెండు కప్పులు తీసుకుంటే వేయించిన తర్వాత అవి తగ్గి ఒక కప్పు అవుతుంది. కడాయిలో నూనె వేడిచేసి శనగపప్పు, మినప్పప్పులను సన్న సెగమీద వేయించాలి. అవి కాస్త వేగాక.. జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, నువ్వులు జతచేయాలి. మంచి వాసన వచ్చే వరకూ కలియతిప్పుతూ చివర్లో ఇంగువ వేసి.. కొన్ని క్షణాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసి.. వెల్లుల్లి రెబ్బలు జోడించాలి. కడాయి వేడికి అందులో ఉన్న నీరు ఇంకిపోతుంది. చల్లారిన తర్వాత మునగాకు, ఉప్పు జోడించి కొంచెం బరకగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ పౌడర్‌ను గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే చాలారోజులు తాజాగా ఉంటుంది. నెయ్యి లేదా నూనెతో తింటే కమ్మగా ఉంటుంది. ఇది ఇడ్లీ దోశల్లోకి కారప్పొడిగానే కాదు.. అన్నంలోనూ బాగుంటుంది. మునగాకుపొడి రుచీ ఆరోగ్యం కూడా. ఇందులో క్యాల్షియం, ఐరన్ ఉండటాన ఎముకలు పటిష్టంగా ఉంటాయి, రక్తహీనత సమస్యను నివారిస్తుంది.

## నిమ్మ తొక్కల పచ్చడి !

నిమ్మకాయ పచ్చడిని ఇష్టపడని వాళ్లు ఉండరంటే అతిశయం కాదు. జ్వరం వచ్చినప్పుడు కూడా ఈ పచ్చడి నోటికి హితవుగా ఉంటుంది. నిమ్మకాయల తోనే కాదు.. వాటి తొక్కలతోనూ కమ్మటి పచ్చడి చేయొచ్చు..

ఈ పచ్చడి కోసం... నిమ్మతొక్కలు – 2 కప్పులు, ఉప్పు – రుచికి తగినంత, పసుపు – 2 స్పూన్లు, ఇంగువ – అర స్పూన్, బెల్లం పొడి – 2 టేబుల్ స్పూన్లు, నిమ్మరసం – 4 స్పూన్లు, కారం – 6 స్పూన్లు, నూనె – 3 టేబుల్ స్పూన్లు, ఇంగువ – అర స్పూన్, మిరియాలు, నల్ల జీలకర్ర, సోంపు, వాము – స్పూన్ చొప్పున, శనగపప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర – ముప్పావు స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే... తడి లేని శుభ్రమైన జాడీలో కారం, పసుపు, ఉప్పు, బెల్లంపొడి, నిమ్మరసం వేసి కలపాలి. తడి లేని, గింజలు తీసేసిన నిమ్మతొక్కలను సన్న ముక్కలుగా కోసి ఇందులో వేయాలి. మిరియాలు, వాము మొదలైన దినుసులను నూనె లేకుండా దోరగా వేయించాలి. చల్లారాక కచ్చాపచ్చా దంచి జాడీలో వేసి కలపాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ముందు ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు.. శనగపప్పు, మినప్పప్పు, మెంతులు, జీలకర్ర, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. అన్నీ చక్కగా వేగి.. మంచి వాసన వస్తుండగా.. సెగ తీసేయాలి. ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. తియ్యతియ్యగా, పుల్లపుల్లగా ఉండే లెమన్ పీల్ పికిల్ ఎంతో ప్రత్యేకంగా ఉండి పిల్లలూ పెద్దలూ అందరికీ నచ్చేస్తుంది



## కోడిగుడ్లలో ఉండే కొలెస్ట్రాల్ మన శరీరానికి హాని చేస్తుందా..

గుడ్లు ఆరోగ్యానికి మంచివా? లేక కొలెస్ట్రాల్‌ను పెంచే ఆహారమా? అనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా గుడ్డు పచ్చసొన తినాలా వద్దా అనే విషయంలో చాలామందికి ఇంకా సందేహాలు ఉన్నాయి.

ఒకప్పుడు గుడ్డు పచ్చసొన వల్ల గుండెజబ్బుల ప్రమాదం పెరుగుతుందని భావించేవారు. అయితే తాజా పోషకాహార పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేశాయి. ఇప్పుడు గుడ్లలో ఉండే కొలెస్ట్రాల్ కంటే మన మొత్తం ఆహారపు అలవాట్లే ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక గుడ్డు పచ్చసొనలో సుమారు 200 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుంది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం ఆరోగ్యంగా ఉన్న పెద్దలు రోజుకు 300 మిల్లీగ్రాముల వరకు కొలెస్ట్రాల్ తీసుకోవచ్చు. ఈ కారణంగా చాలామంది గుడ్డు పచ్చసొన తింటే రక్తంలో కొలెస్ట్రాల్ వెంటనే పెరుగుతుందని భావిస్తుంటారు. కానీ పోషకాహార నిపుణుల ప్రకారం ఆహారంలో ఉండే కొలెస్ట్రాల్ నేరుగా రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచదు. పోషకాహార నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి ప్రధాన కారణం శాచురేటెడ్ ఫ్యాట్స్. అంటే అధికంగా వేయించిన పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక కొవ్వు ఉన్న ఆహారాలు ఎక్కువ హానికరమని చెబుతున్నారు. సహజసిద్ధమైన గుడ్లు వంటి ఆహారాలను పూర్తిగా మానేయడం సరైన పరిష్కారం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. గుడ్లను చాలామంది కేవలం కొలెస్ట్రాల్ మూలంగా మాత్రమే చూస్తారు. కానీ అవి అనేక ముఖ్యమైన పోషకాల నిల్వగా కూడా గుర్తింపు పొందాయి. గుడ్లలో విటమిన్ ఎ, బి విటమిన్లు, ఫోలేట్, సెలీనియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో, మెదడు పనితీరును మెరుగుపరచడంలో, శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్డు పచ్చసొన పూర్తిగా తొలగిస్తే ఈ ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందకుండా పోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక రోజుకు ఎంతమేర గుడ్లు తినాలి అనే విషయానికి వస్తే, సమతుల్యత చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు నాలుగు గుడ్డు తెల్లసొనలు, రెండు పచ్చసొనలు వరకు తీసుకోవచ్చని చెబుతున్నారు. కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా రోజుకు నాలుగు తెల్లసొనలు, ఒక పచ్చసొన వరకు తీసుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ విధంగా తీసుకుంటే గుడ్లలోని పోషకాలు లభిస్తాయి, అదే సమయంలో అధిక కొలెస్ట్రాల్ భయం కూడా ఉండదని పేర్కొంటున్నారు. గుడ్డు పచ్చ సొనను పూర్తిగా మానేయాల్సిన అవసరం చాలా మందికి లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, నియంత్రిత ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలే కొలెస్ట్రాల్ నియంత్రణలో కీలకమని చెబుతున్నారు. గుడ్లను సరైన పరిమాణంలో తీసుకుంటే అవి సమతుల ఆహారంలో భాగంగా ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరిస్తున్నారు.




## వేసవిలో శరీరానికి చల్లదనాన్ని అందించే మధురమైన పానీయం..

ఎండాకాలం తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న సమయంలో శరీరానికి చల్లదనాన్ని అందించే సంప్రదాయ పానీయాలపై ప్రజలు మరింత ఆసక్తి చూపిస్తున్నారు. ఆరోగ్యం మీద అవగాహన రావడంతో చాలా మంది ఇంట్లోనే వివిధ రకాల ఆరోగ్యకరమైన చల్లని పానీయాలను తయారు చేసి తీసుకుంటున్నారు. అలాంటి



ఆరోగ్యకరమైన వేసవి పానీయాల్లో గుజరాత్‌కు చెందిన వరియాలి షర్బత్ ఒకటి. సోంపు గింజలతో తయారయ్యే ఈ షర్బత్ శరీరానికి చల్లదనం ఇవ్వడమే కాకుండా జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తేలికైన రుచితోపాటు సహజ సువాసన కలిగిన ఈ పానీయం వేసవిలో మంచి ఉపశమనం ఇస్తుందని చెప్పవచ్చు. గుజరాతీ కుటుంబాల్లో తరతరాలుగా తయారవుతున్న ఈ సంప్రదాయ డ్రింక్‌లో ప్రధానంగా సోంపు గింజలు, చక్కెర, నిమ్మరసం వంటి పదార్థాలను ఉపయోగిస్తారు. సహజ శీతల గుణాలు ఉండటంతో ఇది వేసవి వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. మధ్యాహ్న సమయంలో లేదా ఉక్కపోత ఎక్కువగా ఉన్నప్పుడు ఈ షర్బత్ తాగితే శరీరానికి తక్షణ తాజాదనం లభిస్తుంది. సోంపు గింజలు జీర్ణక్రియకు మేలు చేస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. కడుపు ఉబ్బరం, ఆమ్లత్వం, భోజనం తర్వాత కలిగే భారమైన భావన వంటి సమస్యలను తగ్గించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. అందుకే వరియాలి షర్బత్‌ను కేవలం రుచికోసం మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా తాగుతుంటారు. ఈ పానీయంలో ఉండే సహజ సువాసన మనసుకు ప్రశాంతతను కలిగిస్తుంది. వేసవిలో అలసటగా అనిపించినప్పుడు ఈ షర్బత్ తాగితే శరీరం, మనసు రెండూ తేలికగా అనిపిస్తాయి. అదనంగా సోంపులో యాంటీఆక్సిడెంట్లు, కొన్ని అవసరమైన పోషకాలు కూడా ఉండటంతో ఇది శరీరానికి సహజ హైడ్రేషన్‌ను అందించడంలో ఉపయోగపడుతుంది. ప్యాకేజ్డ్ సాఫ్ట్‌డ్రింక్స్‌తో పోలిస్తే వరియాలి షర్బత్ ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ఉంటుంది. కృత్రిమ రంగులు, ఫ్లేవర్లు లేకుండా ఇంట్లోనే సులభంగా తయారుచేసుకోవచ్చు.ఈ షర్బత్ ను తయారు చేసుకోవడం కూడా చాలా సులభం. వరియాలి షర్బత్ ను తయారు చేసుకోవడానికి కావల్సిన పదార్థాలు, తయారీ విధానాన్ని వంట నిపుణులు వివరిస్తున్నారు.

## అమెరికా కంపెనీల నుంచి రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు



అమెరికా కంపెనీలు భారత్‌లో 60 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6 లక్షల కోట్ల)కు పైగా పెట్టుబడులు పెడుతున్నట్లు గత ఆరు నెలల్లోనే ప్రకటించాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. ఇందులో అమెజాన్, గూగుల్ వంటి కంపెనీలు ప్రకటించిన డేటా సెంటర్ల పెట్టుబడులూ భాగమే. అంతర్జాతీయ కంపెనీలకు భారత్ ఒక విశ్వసనీయ వ్యవస్థతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ఎవరూ ఇవ్వని విధంగా నిపుణులు, మార్కెట్ అవకాశాలను అందించడమే ఇందుకు కారణమని గురువారమిక్కడ జరిగిన 'యాన్యువల్ లీడర్‌షిప్ సమిట్ ఆఫ్ ద అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్'లో పేర్కొన్నారు.




# కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ డివిడెండ్


కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ




నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు-కమీషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు – తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.

# లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్లు లాభపడ్డాయి. దేశీయంగా రూపాయి విలువ బలపడడం, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. ఓ దశలో 600 పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైన సెన్సెక్స్.. చివరికి మోస్తరు లాభాలకే పరిమితమైంది. నిఫ్టీ 23,700 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 75,260.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,183.36) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,810.97 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 231.99 పాయింట్ల లాభంతో 75,415.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.60 పాయింట్ల లాభంతో 23,719.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 63 పైసలు బలపడి 95.73కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.



సన్‌ఫార్మా, ఐటీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 105.07 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4532 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# రూపాయి విలువ తగ్గనీయండి: అరవింద్ పనగారియా



అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో రూపాయి విలువ రోజురోజుకు పతనమవుతోంది. ఈ క్రమంలోనే నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI)కు కీలక సూచనలు చేశారు. చమురు కొరత స్వల్పకాలికమైనా.. దీర్ఘకాలికమైనా రూపాయి విలువ తగ్గాల్సిందేనన్నారు. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకుంటుందని పేర్కొన్నారు. రూపాయి విలువ తగ్గితే దిగుమతులకు అయ్యే ఖర్చు పెరిగినప్పటికీ.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుందని.. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో గణనీయంగా కోలుకుంటుందని అరవింద్ పనగారియా పేర్కొన్నారు. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే.. భారత విదేశీ మారక నిల్వలను హరించివేస్తుందని హెచ్చరించారు. రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుందని తెలిపారు. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధారపడకూడదని ఆర్‌బీఐకి సూచించారు. వాటిని తాత్కాలిక, ఖరీదైన చర్యలుగా అభివర్ణించారు. 2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే.. నేడు భారత దేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని పనగారియా పేర్కొన్నారు. 2013లో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం ఆర్‌బీఐ చేపడుతున్న మెరుగైన ద్రవ్య నిర్వహణ చర్యల వల్ల ద్రవ్యోల్బణ స్థాయిలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.

# హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ విడుదల..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ హోండా కార్స్ ఇండియా తన పాపులర్ హైబ్రిడ్ సెడాన్ హోండా సిటీ 2026ని లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధరను రూ.11.99 లక్షలుగా నిర్ణయించింది. మిడ్‌సైజ్ సెగ్మెంట్‌లో ఫోక్స్‌వ్యాగన్ వర్టస్, స్కోడా స్లావియా, హ్యుందాయ్ వెర్నాకు గట్టి పోటీ ఇవ్వనుంది. హోండా సిటీతో పాటు జడ్‌ఆర్-వి ఎస్‌యూవీని ఆవిష్కరించింది.




హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్‌లో ముందు భాగాన్ని పూర్తిగా మార్చేసింది. హనీకూంబ్ తరహాలో ఫ్రంట్ గ్రిల్, లైట్‌తో కూడడిన స్ట్రిప్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేతో కూడిన 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోఇన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, ఫ్రంట్ వెంటిలేటెడ్, 8 స్పీకర్ సిస్టమ్, యాంబియెంట్ లైటింగ్, ఫుట్‌వీల్ లైటింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 360 డిగ్రీ కెమెరా, ఆరు ఎయిర్ బ్యాగులు, హిల్‌హోల్డ్ అసిస్ట్, ADAS ఫీచర్లు ఉన్నాయి. ఈ కారులో 1.5 లీటర్ నాచురల్ యాస్పిరేటెడ్ ఇంజిన్ 121hp పవర్‌ను, 145Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ లేదా సీవీటీ గేర్ బాక్స్‌తో వస్తోంది.

# హర్మూజ్ మూసివేత కొనసాగితే.. 200 డాలర్లకు ముడి చమురు!

ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి మూతపడటంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఇప్పటికే రెక్కలొచ్చాయి. ఒకవేళ పరిస్థితి మరింత దిగజారితే బ్యారెల్ ముడి చమురు ధర 200 డాలర్లకు చేరుకుంటుందని డేటా అనలటిక్స్ సంస్థ ఉడ్ మెకంజీ పేర్కొంది. అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక మాంద్యానికి దారితీయవచ్చని ఈ నివేదిక హెచ్చరించింది.

ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటికే ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. చమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు భయాలు నెలకొన్నాయి. ప్రస్తుతం గల్ఫ్ దేశాల నుంచి వచ్చే 11 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా నిలిచిపోయింది. ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో 20 శాతానికి సమానమైన 80 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరాలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే, హర్మూజ్ తెరుచుకోవడంపై అంతర్జాతీయ ఆయిల్, గ్యాస్, ధరలు, ఇంధన డిమాండ్లు ఆధారపడి ఉంటాయని ఉడ్ మెకంజీ పేర్కొంది. జూన్ నాటికి సమస్య తగ్గితే 2026 చివరినాటికి బ్రెంట్ క్రూడ్ ధర 80 డాలర్లకు, వచ్చే ఏడాదికి 65 డాలర్లకు తగ్గుతుందని అంచనా వేసింది. చర్చలు వేసవి చివరివరకు (అక్టోబర్) ఈ మార్గం మూతపడితే 2026 ద్వితీయార్థంలో ప్రపంచవ్యాప్తంగా స్వల్ప ఆర్థిక మాంద్యం రావొచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది చివరివరకు



హర్మూజ్ మూతపడితే క్రూడాయిల్ 200 డాలర్ల మార్కును తాకుతుందని అంచనా వేసింది. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ 0.4 శాతం క్షీణించొచ్చని పేర్కొంది. ఈ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగడం వల్ల ఆసియా, యూరప్ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లే అవకాశం ఉందని, అమెరికా ఎల్ఎన్‌జీకి డిమాండ్ పెరగొచ్చని ఉడ్ మెకంజీ అంచనా వేసింది. హర్మూజ్ మూసివేత ఆగస్టు వరకు కొనసాగితే ప్రపంచ ఆర్థికవ్యవస్థ 2008 నాటి ఆర్థిక మాంద్యం పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ రాపిడాన్ ఎనర్జీ గ్రూప్ పేర్కొంది. ఆగస్టు లేదా అంతకంటే ఎక్కువ కాలం మూసివేస్తే.. మార్కెట్లో రోజుకు దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల చమురు కొరత ఏర్పడుతుందని, తద్వారా ప్రపంచవ్యాప్తంగా చమురు వినియోగం భారీగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది. చమురు ధరల పెరుగుదల వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి, వృద్ధి మందగించే ముప్పు పొంచిఉందని తెలిపింది. అయితే, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు 1970 లేదా 2008 నాటి కంటే కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, చమురు ధరలు నిరంతరం పెరిగితే మాత్రం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొంది.




## నితీశ్ వేగం వెనుక...



తెలుగబ్బాయి నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో వేగం పెరిగింది.. కచ్చితత్వం పెరిగింది.. ఈ ఐపీఎల్‌లో అతడి బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. టెస్టు జట్టుతో పాటు.. వన్డే జట్టులో చోటు దక్కడానికి కారణం కూడా అతడి బౌలింగ్‌లో కొత్తగా వచ్చిన మార్పేనని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. అఫ్గానిస్థాన్‌కు ఎంపిక చేసిన టెస్టు, వన్డే జట్లలో నితీశ్ చోటు దక్కించుకున్నాడు. ఇంతకి నితీశ్ బౌలింగ్‌లో వచ్చిన మార్పు ఏంటి. అందుకు కారణమైన ప్రముఖ ఫాస్ట్ బౌలింగ్ కోచ్ స్టీఫాన్ జోన్స్ వివరించాడు. "ఫాస్ట్ బౌలింగ్ అంటే భుజ బలానికి సంబంధించిన విషయం కాదు. బుర్రకు సంబంధించింది. కొన్ని శిక్షణ పద్ధతుల ద్వారా నితీశ్ బౌలింగ్‌కు వేగాన్ని అందించాం. ఏడు రోజులు పాటు నితీశ్ కఠోర సాధన చేశాడు. ఈ క్రమంలో అతడి రనప్ మార్చా. నితీశ్‌ను వీలైనంత వేగంగా, నేరుగా పరుగెత్తేలా చేశాను. కాస్త జోఫ్రా ఆర్చర్ శైలిని అనుసరించేలా చేశాను. అతడు శరీరాన్ని ఎక్కువ ఉపయోగించేలా చేశాను. శిక్షణ వల్ల అతడి బౌలింగ్ ఎంతో మెరుగైంది" అని జోన్స్ వివరించాడు.

# ప్రమాణాలు పెరిగాయి.. ఇప్పుడు ఏ జట్టుకైనా కష్టమే: అశ్విన్



ఐపీఎల్‌లో ఐదేసి కప్పులను నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ హవా గత కొన్ని సీజన్లలో తగ్గుముఖం పట్టింది. కొత్త టీమ్‌లు దూసుకొస్తున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్.. ఇలా ప్రతి జట్టూ తమ సత్తా చాటుతున్నాయి. దీనికి కారణం ఐపీఎల్ ప్రమాణాలు అత్యుత్తమ స్థాయికి చేరుకోవడమేనని మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

"ఐపీఎల్ టోర్నీ జరిగే కొద్దీ క్లిష్టంగా మారుతోంది. ఏ జట్టు కూడా ఎక్కువ వ్యూహాత్మక తప్పిదాలు చేయడం లేదు. వేలంలో మంచి ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడం నుంచి హోం గ్రౌండ్ అడ్వాంటేజ్‌తో వ్యూహాలను పన్నుతున్నాయి. అందుకే, ఐదేళ్లలో రెండు లేదా మూడు టైటిళ్లు గెలవడం ఇప్పుడు తేలికైన విషయం కాదు" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో సీఎస్‌కే, ముంబయి గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైన సంగతి తెలిసిందే. ధోని హయాంలో జట్టంతా సమతూకంగా ఉండేది. ఇకనైనా సీఎస్‌కే జట్టు అన్ని విభాగాలను బ్యాలెన్స్ చేసుకోవాలని అశ్విన్ సూచించాడు. "సీఎస్‌కే ఇకనైనా నాణ్యతపై ఇన్వెస్ట్ చేయాలి. క్వాలిటీ క్రికెటర్లను ఎంపిక చేసుకోవాలి. దాని ఉద్దేశం ఇంకాస్త అనుభవం కలిగిన వారికి అవకాశమివ్వాలి. బౌలింగ్‌లో ఈసారి ఎక్కువ అనుభవం లేదు. ఫాస్ట్, స్పిన్ బౌలింగ్‌లో వైవిధ్యం కనిపించాలి. యువ క్రికెటర్లు ఉండటం మంచిదే. కానీ, అందరూ అలాంటి వారయితే, ఇబ్బందులు తప్పవు. ఈ సీజన్‌లో శివమ్ దూబే బ్యాటింగ్ సీఎస్‌కే సానుకూలాంశం. ఇప్పుడున్న వారికి చెపాక్ మైదానం కూడా సూట్ కాదు. గతంలో సురేశ్ రైనా, బద్రినాథ్, అంబటి రాయుడు, షేన్ వాట్సన్, మైకెల్ హస్సీ వంటి వారు చెపాక్ పరిస్థితుల్లో ఎలా ఆడాలో ఆడి చూపించారు. అలాగని ఇప్పుడు వారిని తక్కువ చేయడం లేదు. కార్తిక్ శర్మ అద్భుతంగా ఆడాడు. స్పిన్నర్లను కాస్త ఆలస్యంగా ఆడటం అతడి స్పెషాలిటీ. మిగతావారికీ కాస్త అనుభవం రావాలి" అని అశ్విన్ వెల్లడించాడు.

## సీరియస్‌గానే ఆ ప్రశ్న నన్ను అడుగుతున్నారా?



ఐపీఎల్ 2026లో ఎంఎస్ ధోని ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. మోకాలి గాయం తిరగబెట్టడంతో మైదానంలోకి దిగలేదు. మరి వచ్చే సీజన్‌లోనైనా ఆడతాడా? అంటే సరైన స్పష్టత సీఎస్‌కే శిబిరం నుంచి రాలేదు. తాజాగా గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమిపాలైన సీఎస్‌కే ఈ ఎడిషన్‌లో తన ప్రయాణాన్ని ముగించింది. అనంతరం విలేకర్ల సమావేశంలో చెన్నై బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్ మాట్లాడాడు. ఈ సందర్భంగా ధోని వచ్చే సీజన్‌లో ఆడతాడా? అనే ప్రశ్న ఎదురైంది. దానిపై స్పందిస్తూ 'నిజంగానే ఈ ప్రశ్నను నన్ను అడుగుతున్నారా?' అంటూ నవ్వేశారు. ధోని ఆడతాడనే జట్టు ఆశిస్తున్నట్లు సిమన్స్ వెల్లడించాడు. "ధోని నెట్స్‌లో చాలా బాగా ఆడాడు. భారీ షాట్లు బాదాడు. కానీ, కాలుకి గాయం కావడంతో రన్ చేయడం కష్టమైంది. అందుకే, అతడు మైదానంలోకి దిగలేదు. బంతిని ఆడే తీరులో మాత్రం ఎక్కడా వెనకడుగు వేయలేదు. వచ్చే సీజన్‌లో ఆడతాడా? లేదా? అనేది ధోని మాత్రమే చెప్పగలడు. అతడే నిర్ణయం తీసుకోగలడు. ఆడలేనని అనిపిస్తే ఆడడు. బాగుందనిపిస్తే బరిలోకి దిగుతాడు. జట్టుకు ఏది అవసరమో అతడికి తెలుసు. దానిని బట్టే నిర్ణయం తీసుకుంటాడు. జట్టుతోపాటు ధోని ఉండటం మాకు కలిసొచ్చే అంశమే" అని సిమన్స్ తెలిపాడు. "ఐపీఎల్ గెలవడంలో కీలకమైన అంశం.. జట్టులో సమతుల్యత సాధించడం. ప్రతి సీజన్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శించే టీమ్‌ను కలిగిఉండటం అత్యవసరం. మేం ఆ దిశగానే సాగుతున్నాం. జట్టులో చేసే మార్పులు చాలాముందే తీసుకుంటాం. కఠిన పరిస్థితులను ఎదుర్కొనేలా జట్టును సిద్ధం చేస్తాం. మా జట్టులోని ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా మంచి ఆటగాళ్లే. కార్తిక్, ఉర్విల్, బ్రెవిస్, కాంబోజ్, ముకేశ్ చౌదరి.. ఇలా ఎక్కువమంది కుర్రాళ్లు ఉన్నారు. అయితే, వారికి కాస్త సమయం ఇవ్వాలి. పెద్దగా అనుభవం లేని ప్లేయర్లు ఉన్నారు. ఇక జట్టులో గాయాలూ ఇబ్బందిపెట్టాయి. కీలక సమయంలో జేమీ ఓవర్టన్, ఖలీల్ జట్టును వీడారు. మిడిల్ ఓవర్లలో ఓవర్టన్ సమర్థవంతంగా బౌలింగ్ చేశాడు" అని సిమన్ వెల్లడించాడు.

# టెన్షన్ వద్దు.. నేనున్నాగా..

హ్యాట్రిక్ ఓటములతో ప్లేఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకున్న రాజస్థాన్ రాయల్స్ ఎట్టకేలకు లఖ్‌నవూపై అద్భుత విజయంతో రేసులోకి వచ్చింది. వైభవ్ సూర్యవంశీ సూపర్ బ్యాటింగ్‌తో అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌కు ముందు ఆర్ఆర్ ప్రధాన కోచ్ కుమార సంగక్కర చాలా ఒత్తిడిలో ఉన్నాడని.. వైభవ్ మాత్రం గెలిపిస్తానని అతనికి భరోసా ఇచ్చాడట. ఇదే విషయాన్ని



తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ వెల్లడించాడు. 15 ఏళ్ల కుర్రాడు ఇంత పరిణతితో ఆలోచించడం అద్భుతమని సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఆరెంజ్ క్యాప్ రేసులో మూడో స్థానంలో ఉన్నాడు. అతడి ఖాతాలో 579 పరుగులు ఉన్నాయి. ముంబయితో ఆర్ఆర్ మే 24న తన చివరి లీగ్ మ్యాచ్ ఆడాల్సిఉంది. ఇందులో గెలిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. "అంతకుముందు మూడు మ్యాచుల్లో మాకు అనుకూలంగా ఫలితం రాలేదు. లఖ్‌నవూతో మ్యాచ్‌లోనూ మాకు భారీ లక్ష్యమే ఎదురైంది. నేను ప్యాడ్లు కట్టుకుని సిద్ధమవుతున్నప్పుడు మా కోచ్ కుమార సంగక్కరను చూశా. అప్పుడు చాలా టెన్షన్‌గా కనిపించాడు. ఒత్తిడిలో ఉన్నట్లు అనిపించింది. కానీ, నేను మాత్రం చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. బాగా ఆడి జట్టును గెలిపించగలనని అనుకున్నా. ఇదే మాటను మా కోచ్‌కు చెప్పా. ఈ పిచ్‌పై ఇదేమీ భారీ స్కోర్ కాదు" అని వైభవ్ వెల్లడించాడు. లఖ్‌నవూపై వైభవ్ సూర్యవంశీ శివాలెత్తాడు. కేవలం 38 బంతుల్లోనే 93 పరుగులు చేసి రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇందులో ఏడు ఫోర్లు, 10 సిక్స్‌లు ఉన్నాయి. ఆ మ్యాచ్‌లో ఆర్ఆర్ ఏడు వికెట్ల తేడాతో "సచిన్ తెందూల్కర్ భారత జట్టులోకి వచ్చినప్పుడు హేమాహేమీ బౌలర్లతో ఢీకొట్టాల్సి వచ్చింది. ఎందుకో అతడు చాలా స్పెషల్ అని అప్పుడే అనుకున్నా. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు యువ సచిన్ గుర్తుకొచ్చాడు. తప్పకుండా దేశానికి మంచి పేరు తీసుకొస్తాడని అనుకుంటున్నా. క్రికెట్ కోసమే సూర్యవంశీని ఆ దేవుడు తయారుచేసినట్లుగా ఉంది. అతడు ఎలాంటి విధానంలో ఆడుతున్నాడో అలాగే కొనసాగనివ్వాలి" అని మాజీ క్రికెటర్ కిరణ్ మోరె అభిప్రాయపడ్డారు.

# నా వల్లే అతడికి వికెట్లు.. సిరాజ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తన లీగ్ మ్యాచులను ముగించింది. ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్న ఆ జట్టు టాప్ -2లో బెర్తును ఖరారు చేసుకొనేలా సీఎస్‌కేపై అద్భుత విజయం సాధించింది. హైదరాబాదీ పేసర్ సిరాజ్ సూపర్ స్పెల్‌తో ఆకట్టుకున్నాడు. మూడు ఓవర్లలో 26 పరుగులు ఇచ్చిన అతడు 3 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. డేంజరస్ బ్యాటర్ సంజు శాంసన్‌ను తొలి బంతికే పెవిలియన్‌కు చేర్చి సీఎస్‌కేను దెబ్బకొట్టాడు. సంజును ఔట్ చేసేందుకు వేసుకున్న ప్లాన్ ఫలించిందని సిరాజ్ సంతోషం వ్యక్తంచేశాడు. అలాగే ఐపీఎల్ ఆరంభంలో రిథమ్ కోసం ఇబ్బందిపడినట్లు అంగీకరించాడు. 'ఇప్పుడు బౌలింగ్‌లో మంచి రిథమ్ అందుకొన్నా. ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందు వరల్డ్ కప్ టైమ్‌లో కొన్ని మ్యాచులకు దూరంగా ఉన్నా. అప్పుడు చాలా శ్రమించా. బంతిని వదిలే విధానంపై దృష్టిపెట్టా. ఈ సీజన్‌లో తొలి మూడు మ్యాచుల్లో కాస్త ఇబ్బందిపడ్డా. ఎక్కడ పొరపాటు చేస్తున్నానో నా వీడియోలను పదేపదే చూశా. దానిపై ఫోకస్ పెట్టా. ఇప్పుడు అంతా సెట్ అయింది. నేనెప్పుడూ కొత్త బంతితోనే ప్రాక్టీస్ చేస్తా. లైన్ అండ్ లెంగ్త్ విసిరేందుకు ప్రయత్నిస్తా. ఆ తర్వాత నాలుగైదు ఓవర్లు కేవలం యార్కర్ల పైనే దృష్టిపెడతా. మ్యాచ్‌లో ఏం చేయాలనుకుంటానో.. అదంతా ప్రాక్టీస్ చేస్తా" అని సిరాజ్ వెల్లడించాడు.

"నేను పవర్ ప్లేలో బౌలింగ్ చేస్తున్నా. ప్రత్యర్థిపై ఒత్తిడి తెచ్చి వికెట్ తీయాల్సిన బాధ్యత నాపై ఉంది. సంజు శాంసన్‌ను తొలి బంతికే ఔట్ చేయడం కోసం ప్రణాళిక అనుకున్నా. దానిని సరిగ్గా అమలుచేసి ఫలితం రాబట్టా. ఫస్ట్ బాల్‌లోనే బౌండరీ కొట్టేందుకు బ్యాటర్ ప్రయత్నిస్తాడు. సంజు విషయంలోనూ అదే అనుకున్నా. డ్రైవ్ చేసి ఫోర్ వచ్చినా ఫర్వాలేదు.. ఆఫ్‌సైడ్ ఫుల్లర్ డెలివరీ సంధించాలని అనుకున్నా. అదే చేశా. సంజు వికెట్ దక్కింది. ఇంతకుముందు చెపాక్‌లోనూ ఇలాంటి బంతికే సంజు అవుట్ అయ్యాడు. మరోసారి ప్రయత్నించి చూశా. సక్సెస్ అయింది. అంతేకానీ, ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. నిలకడగా లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేస్తున్నా. రబాడ వికెట్లు తీస్తున్నాడంటే దానికి కారణం నేనే. ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి సృష్టిస్తున్నా. మా బౌలింగ్ పార్టనర్‌షిప్ ఇలా ఉంది. జట్టుగా బౌలింగ్ చేస్తున్నాం. ఇప్పుడు అంతా బాగుంది" అని సిరాజ్ తెలిపాడు.



# వృదయం సినిమా
MOVIE TIME!

## మమ్ముట్టి, మోహన్‌లాల్ 'పేట్రియాట్'.. ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్

వృదయం సినిమా

మలయాళ అగ్ర హీరోలు మమ్ముట్టి (Mammootty), మోహన్‌లాల్ (Mohanlal) కలిసి నటించిన సినిమా 'పేట్రియాట్' (Patriot Movie). ఈ మూవీ ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'జీ 5' (Zee 5)లో జూన్ 5 (Patriot Movie Streaming date) నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు ఆడియో కూడా అందుబాటులో ఉండనుంది. దేశభక్తితో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. నయనతార, ఫహాద్ ఫాజిల్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించారు.దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమాకు మహేష్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు.



## 'పెద్ది' నుంచి బిగ్గెస్ట్ స్పెషల్ సాంగ్ రిలీజ్



**వృదయం:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, ఈరోజు చిత్ర బృందం మూడవ సింగిల్ 'హెల్లాల్లో' ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇటీవలి కాలంలో వచ్చిన అత్యంత ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ స్పెషల్ సాంగ్స్‌లో ఒకటిగా నిలవనుందని అర్థమవుతోంది. పవర్ ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్, జాతర వాతావరణాన్ని తలపించే ట్యూన్‌తో పాట ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకుంటోంది.ఈ పాటలో రామ్ చరణ్ తన రగ్డ్, స్టైలిష్ లుక్‌లో అదిరిపోయే స్టెప్పు లతో ఆకట్టుకుంటున్నారు. ఆయనతో పాటు శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ కూడా అలరించారు. శ్రుతి హాసన్ తన బోల్డ్ అటిట్యూడ్‌తో, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ ఎనర్జీతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలి చారు. ముగ్గురి స్క్రీన్ ప్రెజెన్స్ కలిసి ఈ పాటను మరింత గ్రాండ్‌గా మార్చింది.పూర్తి పాటను రేపు భోపాల్‌లో జరగనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్ లో విడుదల చేయనున్నారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన బృందం ఈ పాటను ప్రత్యక్షం గా ప్రదర్శించనుండటంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీని ఆర్. రత్నవేలు అందిస్తుండగా, ఎడిటింగ్ ను జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి నిర్వహిస్తున్నారు.

## "తక్షక" సినిమా పోస్టర్ లాంచ్





మెగాస్టార్ చిరంజీవితో విశ్వంభర చిత్రాన్ని రూపొందిస్తున్న ప్రముఖ దర్శకుడు వశిష్ట మల్లిడి సోదరుడు కృష్ణ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న సినిమా "తక్షక". ఈ చిత్రంలో కుశాల్ రాజు హీరోగా పరిచయమవుతున్నారు. ఎంఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్ పై డా. లతా రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ డ్రామా కథతో రూపొందుతున్న "తక్షక" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ ద్వారా రాబోతోంది. తాజాగా ఈ చిత్ర పోస్టర్ ను స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ లాంఛ్ చేశారు. ఈ సందర్భంగాడైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ – మల్లిడి సత్యనారాయణరెడ్డి గారి కుటుంబంతో నాకు ఎంతో అనుబంధం ఉంది. వారి కుటుంబం నుంచి దర్శకుడిగా మారుతున్నారు కృష్ణ మల్లిడి. చిన్నప్పటి నుంచి నాకు ఎంతో తెలిసిన కుర్రాడు కృష్ణ. ఫస్ట్ టైమ్ మూవీ డైరెక్ట్ చేస్తున్నాడు. కృష్ణ మల్లిడికి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నిర్మాత డా.లతారాజు గారికి థ్యాంక్స్ చెబుతున్నాను.

## 'CASTE' నుంచి మినిస్టర్ నారాయణగా రాజా రవీందర్ ఫస్ట్ లుక్..



**వృదయం:** వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన & దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'CASTE'.ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఈ చిత్రంలో రాజా రవీందర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని మినిస్టర్ నారాయణగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు మేకర్స్.మంత్రి నారాయణ గా రాజా రవీందర్ లుక్ పవర్‌ఫుల్‌గా ఆకట్టుకుంటోంది. తెల్లటి దుస్తులు, భుజంపై పార్టీ కండువా ధరించి ఇంటెన్స్ గా కనిపిస్తున్నారు.ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్ గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు.మేకర్స్ త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు.

## 'ఇట్లు అర్జున' ఫస్ట్ సింగిల్ 28న రిలీజ్




**వృదయం:** స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల తన నిర్మాణ సంస్థ వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న తొలి చిత్రం 'ఇట్లు అర్జున'. "న్యూ గై ఇన్ టౌన్" అనీష్ హీరోగా పరిచ యం అవుతుండగా, మహేష్ ఉప్పల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌తోనే మంచి బజ్ క్రియేట్ చేసింది. అక్కినేని నాగార్జున ఇచ్చిన పవర్ ఫుల్ వాయిస్ ఓవర్ గ్లింప్స్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విడుదలైన పోస్టర్లు, 'ఫైండింగ్ అర్జున' అనే స్పెషల్ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్ర బృందం మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ ఓ సరదా ప్రోమోను విడుదల చేసింది. పియానోపై ఓ ట్యూన్ వాయించేందుకు అనీష్ ప్రయత్నిస్తుండగా, మ్యూజిక్ సెన్సేషన్ 'ఓజీ" థమన్ ఎస్ కాఫీ మగ్ చేతిలో పట్టుకుని అతన్ని ఆసక్తి గా గమనిస్తుంటారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య జరిగే ఫన్నీ సంభాషణ ఆకట్టుకుంటుంది. అనీష్ వాయిస్తున్న ట్యూన్‌ను చూసి సరదాగా ఆటపట్టించిన థమన్, అనంతరం తనదైన శైలిలో మ్యూజికల్ మ్యాజిక్‌ను రివిల్ చేశారు. ఆయన అందించిన సాఫ్ట్ మెలోడీ ఆకట్టుకుంటుంది.


## ఫిలిం ఫెడరేషన్ కు భవనం నిర్మిస్తాం

**వృదయం:** సినీ కార్మికులకు అండగా నిలబడటంలో ఎప్పుడూ ముందుంటారు ప్రముఖ నిర్మాత, దర్శకులు చదలవాడ శ్రీనివాసరావు. చిత్రపురి కాలనీకి కోట్లాది రూపాయల రుణం ఇచ్చి ఆ కాలనీ బ్యాంక్ ఆక్షన్ కు వెళ్లకుండా కాపాడారు చదలవాడ శ్రీనివాసరావు. వందలాది సినీ కార్మికుల కుటుంబాల సొంతింటి కలను బతికించారు. ఇప్పుడు సినీ కార్మికులకు మరో వరాన్ని ఇచ్చారు చదలవాడ శ్రీనివాసరావు. ఫిలిం ఫెడరేషన్ కు సొంత భవనం నిర్మించి ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన హామీ పట్ల ఫెడరేషన్ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ చదలవాడ దాతృత్వం, గొప్ప సేవా గుణాన్ని ప్రశంసించారు.ఏపి ఫిలిం



డెవలప్ కార్పొరేషన్ లో బోర్డు ఆఫ్ డైరెక్టర్ గా నియమితులైన చదలవాడ శ్రీనివాసరావును ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు తమకు శాశ్వత భవనం లేదనే విషయాన్ని శ్రీనివాసరావు గారి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సినీ కార్మికులను ఒకే తాటి మీదికి తీసుకుని వచ్చి వారికి ఉపాధి కలిగే విధానాన్ని విధానాన్నిప్రవేశ పెట్టేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## "సమవర్తి" టైటిల్, ఫస్ట్ లుక్ రిలీజ్



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి "సమవర్తి" అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ & పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## "మేము కాప్'లం" గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్

**వృదయం:** మే 22న రాబోతోన్న "మేము కాప్'లం" సిరీస్ పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను – గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో అజయ్ భూపతి "మేము కాప్'లం" సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు, సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను – గ్రాండ్




ప్రివ్యూ ఈవెంట్‌లో కోన వెంకట్ "మేము కాప్'లం" సిరీస్ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను – గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో తమన్ZEE5 తెలుగు నుంచి "మేము కాప్'లం" అనే మరో ఒరిజినల్ సిరీస్ వచ్చింది. రా ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రొడక్షన్ నెం. 3) బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి నిర్మించిన "మేము కాప్'లం" సిరీస్‌కు 'వికటకవి' ఫేమ్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్‌లో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రను పోషించారు. గెటప్ శ్రీను, రవి తేజ నన్నిమాల వంటి ప్రముఖ తారాగణం నటించారు. ఈ సిరీస్ మే 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో గురువారం నాడు గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమన్, బండ్ల గణేష్, అజయ్ భూపతి, కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.





## ఎపి ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నూతన చైర్మన్, డైరెక్టర్స్ కు శుభాకాంక్షలు

**వృదయం:** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు నూతనంగా నియమితులైన చైర్మన్, డైరెక్టర్స్ కు శుభాకాంక్షలు తెలిపారు టీఎఫ్ సీసీ చైర్మన్, నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్. చైర్మన్ పి.భరత్ భూషణ్, వైస్ చైర్మన్ చిక్కాల మెహర్ రమేష్ కుమార్, డైరెక్టర్లు చదలవాడ శ్రీనివాసరావు, సుమన్ తల్వార్, సాయిమాధవ్ బుర్రా, ఎస్. శివాజీ, శ్రీమతి వై. ఝాన్సీ, వివేక్ కూచిభొట్ల, వి. సముద్ర, మీర్.ఎస్, కందిమళ్ల సాంబ శివరావు, ఏ. సత్యనారాయణ, ఎస్ వీ కృష్ణారెడ్డి, జీ. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చిత్ర పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం ఉన్న పి. భరత్ భూషణ్ ఆధ్వర్యంలో సినీ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోడా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు చైర్మన్ గా పి.భరత్ భూషన్ గారు నియమితులు కావడం సంతోషంగా ఉంది. ఆయన ఈ పదవికి అన్ని విధాలా అర్హులు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.